Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :03 సంచిక : 340 పేజీలు 8 వెల : 5 శుక్రవారం 16 మే 2025

ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక

16th ANNIVERSARY
వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

తారీఫ్

| | |
|---|---|
| | బ్లాక్ & వైట్ పేజి |
| బ్యాక్ కవర్ పేజి మల్టీకలర్ : 50,000/- | బ్యాక్ పేజి : 20,000/- |
| ఇన్నర్ మల్టీకలర్ పేజి : 20,000/- | ఇన్నర్ పేజి : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజి : 70,000/- | ఫ్రంట్ పేజి : 30,000/- |

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.

ప్రకటనదారులకు విజ్ఞప్తి...



# ఆపరేషన్ సిందూర్ విజయం

**5వేల మందితో నేడు తిరంగా ర్యాలీ**

**ర్యాలీలో పాల్గొననున్న సిఎం చంద్రబాబు**

**ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్**

**ర్యాలీకి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రులు, శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. 16వ తేదీ సాయంత్రం 5 గంటలకు స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుండి తిరంగ ర్యాలీ బయలు దేరి బెంజ్‌సర్కిల్‌కు చేరుకుంటుందన్నారు.**

విజయవాడ :పహల్గామ్‌లో భారతీయులపై పాకిస్థాన్ ఉగ్రవాదుల దాడికి ప్రతికారంగా భారత సైన్యం పాకిస్థాన్‌పై చేసిన ఆపరేషన్ సిందూర్ విజయం కావాడాన్ని కీర్తిస్తూ విజయవాడ నగరంలో ఐదు వేల మందితో తిరంగా ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని ర్యాలీకి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు గౌరవనీయులు నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని కీర్తిస్తూ 16వ తేదీ శుక్రవారం విజయవాడలో నిర్వహించనున్న తిరంగా ర్యాలీ నిర్వహణపై గురువారం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పహల్గామ్‌లో భారతీయులపై పాకిస్థాన్ ఉగ్రవాదుల

మిగతా 2లో



## రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన తప్ప ఏమీ లేదు

**చట్టాన్ని అతిక్రమించే పోలీసులపై చర్యలు తప్పవు**

**మాజీమంత్రి అంబటి రాంబాబు హెచ్చరిక**

## రెడ్ బుక్‌ను వదిలేది లేదు



**వైసిపి చేయని అనేక పనులు చేస్తున్నాం**

**జన్ నిర్వాకం వల్లనే ట్రూ అప్ ఛార్జీల వసూలు**

**చంద్రబాబు చొరవతో పెద్ద కంపెనీల రాక**

**నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు**

**ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

**కారర్యకర్తలకు నారా లోకేశ్ పిలుపు**



## అహల్యా భాయి హోల్కర్ త్రిశత జయంతి వేడుకలు

**ఆమె ముందుచూపుతో అనేక సంస్కరణలు చేపట్టారు**

**నివాళి అర్పించిన దగ్గుబాటి పురంధేశ్వరి**

**విజయవాడ:** ఆర్థిక శక్తిగా భారతదేశాన్ని తీసుకెళ్లాలంటే మౌలిక సదుపాయాలు సమకూర్చుకోవాలని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. అలాంటి ఆలోచనలు ఆనాడు అహల్య భాయి హోల్కర్ ఆలోచించి వాటిని అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషి చేశారని చెప్పారు. పరిశ్రమలకు పెట్టుబడులు రావాలంటే ఇలాంటి మౌలిక సదుపాయాలు ఎంత అవసరమో గమనించి వాటిపై ఆనాడే దృష్టి పెట్టారని అన్నారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అహల్యా భాయి హోల్కర్ త్రిశత జయంతి వేడుకల ఏర్పాటు-కు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు మీనాక్షి లేఖీ, బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ ..మహిళల అభివృద్ధి, వారి సంక్షేమం కోసం అహల్య భాయి హోల్కర్ చట్టసవరణలు చేశారని గుర్తుచేశారు. భర్తలు చనిపోయిన మహిళలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో భర్త ఆస్తిలో.. ఆ భార్యకు హక్కు ఉంటుందని చట్టసవరణ చేసి మార్పులు తీసుకువచ్చారని తెలిపారు. దళితులకు భూములు కేటాయించటం వారికీ సంక్షేమం అందించటంలో అహల్య భాయి ప్రముఖ పాత్ర పోషించారని అన్నారు. 1795వ సంవత్సరం ముందే ఇవన్నీ చేశారంటే అహల్య భాయికు ఎంత ముందు చూపు ఉందో అర్థమవుతుందని తెలిపారు. చేనేత రంగం వెనుకబడుతున్న పరిస్థితుల్లో మహేశ్వర్ అనే ప్రదేశంలో వారి ఉనికిని కాపాడారని అన్నారు.

మహిళల్లో ధైర్యాన్ని అహల్య భాయి నింపారని దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. అహల్య భాయి సేవా కార్యక్రమాల కోసం రాష్ట్ర ఖజానా నుంచి ఎప్పుడు ఒక్క రూపాయి తీసుకోలేదని దగ్గుబాటి పురందేశ్వరి గుర్తుచేశారు. పాశ్చాత్య దేశాలు మన దేశంలోని గుడులు గోపురాలపై దాడులు చేశాయని చెప్పారు. ఆలయాలను పరిరక్షించటానికి గర్భగుడి ఉండాలనే ఆలోచనలతో అహల్య భాయి నిర్మించారని అన్నారు. ఉత్తర భారతదేశం నుంచి దక్షిణ భారతదేశం వరకు ఎన్నో ఆలయాలను అహల్యభాయి నిర్మించారని చెప్పారు. మణికర్ణిక ఘాట్లు- వ్యాపారానికి ఉపయోగపడేలా ఒక ఆలోచనతో పరిపాలన ఉండేదని అన్నారు. ఇలాంటి చాలా గొప్ప నిర్ణయాలు ఆలోచనలతో అహల్య భాయి పాలన ఉండేదని చెప్పారు. ఇలాంటి వ్యక్తుల ఆలోచన ఆదర్శంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారని ఉద్ఘాటించారు. 11వ ఆర్థిక శక్తిగా ఉండే భారత్.. మోదీ హయాంలో 4వ ఆర్థిక శక్తిగా ఎదిగిందని గుర్తుచేశారు. జపాన్ దేశం కంటే ఆర్థిక శక్తిగా ముందుండే రోజులు రాబోతున్నాయని దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు.

## హుస్నాబాద్,సిరిసిల్ల జిల్లాలో సైనిక్ స్కూల్

### రాజ్‌నాథ్ సింగ్‌తో చర్చించా: బండి

హైదరాబాద్: సైనిక్ స్కూల్ వివాదంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. హుస్నాబాద్,సిరిసిల్ల జిల్లాలో సైనిక్ స్కూల్ కోసం గత నెల 15న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ను కలిశానని వివరించారు. ఈ సంద్భరంగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సైనిక్ స్కూల్ ఏర్పాటు-కోసం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారన్నారు. తన విజ్ఞప్తికి రాజ్‌నాథ్ సానుకూలంగా స్పందించడం సంతోషంగా ఉందనన్నారు. దీనిపై రాజకీయం చేయడం తగదని బండి హెచ్చరించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి సహకరించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా కలిసిరావాలని కోరుతున్నామన్నారు.





## వక్ఫ్ సవరణ బిల్లు చెల్లుబాటు కేసు

**మే20కి వాయిదా వేసిన సుప్రీం కోర్టు**



## ఉగ్రవాదాన్ని శాశ్వతంగా నిలిపివేయాల్సిందే

**అప్పడే సింధూజలాల గురించి ఆలోచిస్తాం**

**విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ స్పష్టీకరణ**



**యాదాద్రిని దర్శించుకున్న సుందరాంగులు**



# సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

**కాళేశ్వరం వద్ద సిఎం, మంత్రుల పుణ్యస్నానం**

**సరస్వతీమాత విగ్రహాన్ని ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి**

# ఆపరేషన్ సిందూర్ విజయం



దాడికి ప్రతికారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా 16వ తేదీ సాయంత్రం ఐదు వేల మందితో భారత్ మాతాకు జై అంటూ నగరం మారుమ్రోగేలా తిరంగా ర్యాలీని నిర్వహించడం జరుగుతుందన్నారు. ర్యాలీకి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రులు, శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. 16వ తేదీ సాయంత్రం 5 గంటలకు స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుండి తిరంగ ర్యాలీ బయలు దేరి బెంజ్‌సర్కిల్‌కు చేరుకుంటుందన్నారు. విద్యార్థిని విద్యార్థులు 500 మీటర్ల జాతీయ పతాకాన్ని చేతబూని ర్యాలీలో పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలన్నారు. డిజె సౌండ్ సిస్టమ్ ద్వారా జాతీయ సమైఖ్యత సమగ్రతను చాటే విధంగా జాతీయ గీతాలను వినిపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ర్యాలీతో పాటు ముఖ్య కూడలి లో తప్పెటగుళ్ళు, గరగర నృత్యాలు, డప్పు వాయిద్యాలు, నృత్య ప్రదర్శనలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ర్యాలీలో పాల్గొనే ప్రతి ఒక్కరికి జాతీయ జెండాను అందజేసేలా చూడాలన్నారు. ర్యాలీలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చల్లని త్రాగునీటి సౌకర్యం, తాత్కాలిక మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అద్భుత పోరాట పఠిమ చూపిన భారత త్రివిధ దళాల సైన్యాధికారులు, సైనికులను కీర్తిస్తూ నిర్వహించే తిరంగా ర్యాలీ విజయవంతం చేసేందుకు నగర పౌరులు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. లక్ష్మీ నరసింహం, ఆర్‌డివో కానూరి చైతన్య, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# సరస్వతీ పుష్కరాలు ప్రారంభం



**కాళేశ్వరం:** కాళేశ్వరం వద్ద సరస్వతీ పుష్కరాలు ప్రారంభమయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలోని త్రివేణి సంగమంలో సరస్వతి నది పుష్కరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సరస్వతీ పుష్కరస్నానం ఆచరించారు. గురువారం సాయంత్రం కాళేశ్వరం చేరుకున్న సిఎం రేవంత్.. సరస్వతీ పుష్కర ఘాట్ ను ప్రారంభించారు. అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి పుష్కరస్నానం ఆచరించారు. ఆ తర్వాత సరస్వతీదేవి విగ్రహాన్ని సిఎం ఆవిష్కరించారు.అనంతరం నదీ మాతకు హారతి ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు- చేసిన 10 అడుగుల సరస్వతిదేవి విగ్రహాన్ని, భక్తుల వసతి కోసం నిర్మించిన 86 గదుల సముదాయాన్ని సీఎం ప్రారంభించారు. గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా సరస్వతి నది కలిసే ఈ త్రివేణి సంగమంలో ఈ నెల 26 వరకు ఈ మహాక్రతువు జరగనుంది. బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశంతో సరస్వతి నదికి పుష్కరాలు మొదల య్యాయి. బుధవారం రాత్రి 10.35 గంటలకే బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించి పుష్కరకాలం ప్రారంభమవుతున్నా.. గురువారం సూర్యోదయం నుంచి పుష్కర స్నానాలు ఆచరించాలని కాళేశ్వరం ఆలయ అర్చకులు వివరించారు. దీంతో గురువారం వేకువజామున 5.44 గంటలకు సరస్వతి ఘాట్ వద్ద శ్రీగురు మదనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించారు. కాగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత, సరస్వతీ నదులు కలిసి త్రివేణి సంగమంగా ప్రవహిస్తోంది. కాళేశ్వర క్షేత్రం వద్ద త్రివేణి సంగమ తీరంలో ఇవాళ్టి నుంచి ఈనెల 26వ తేదీ వరకు సుమారుగా 12 రోజుల పాటు- సరస్వతీ నది పుష్కరాలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కాళేశ్వరం యాప్, వెబ్ పోర్టల్‌ను ప్రారంభించి, భక్తులు సాంకేతికంగా పొందే సేవలను సైతం అందులో పొందుపరిచారు. సదరు పుష్కరాల సందర్భంగా ప్రతి రోజు సుమారు 50 వేలకు పైగా భక్తులు వచ్చి పుష్కర స్నానం చేయడంతో పాటు- పిండప్రదానం, దంపతీ స్నానం, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వార్లను దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు- చేశారు.

## అమెరికాలో ప్రమాదానికి గురైన పర్వతారోహకులు భారతీయ సంతతికి చెందిన వ్యక్తి మృతి

న్యూయార్క్: అమెరికాలో విషాద ఘటన చోటుచేసుకుంది. పర్వతారోణకు వెళ్లిన బృందంలో ముగ్గురు దుర్మరణం చెందారు. అందులో భారతీయ సంతతికి చెందిన ఒకరు ఉన్నట్లు గుర్తించారు. వాషింగ్టన్ రాష్ట్రంలోని నార్త్ క్యాస్కేడ్స్ పర్వతారోహణకు వెళ్లిన ఓ బృందం ప్రమాదానికి గురయ్యింది. ఈ ఘటనలో భారత సంతతికి చెందిన విష్ణు ఇరిగిరెడ్డి సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ప్రాణాలతో బయటపడిన మరో యువకుడి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు- తెలిసింది. సియాటెల్‌లోని ప్రముఖ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్న విష్ణు (48).. మరో ముగ్గురు స్నేహితులతో కలిసి పర్వతారోహణ కోసం నార్త్ ఎర్లీ వింటర్స్ స్పియర్స్ ప్రాంతానికి వెళ్లారు. దిగే సమయంలో ప్రతికూల వాతావరణం ఎదురయ్యింది. ఈ క్రమంలో వారి యాంకర్ పాయింట్ అదుపుతప్పి 200 అడుగుల లోతులో పడిపోయారు. అందులో ప్రాణాలతో ఉన్న ఓ యువకుడు మాత్రం 64కి.మీ మేర నడిచి.. ఎట్టకేలకు సురక్షిత ప్రాంతానికి చేరుకొన్నాడు. ప్రమాద విషయాన్ని అధికారులకు వెల్లడించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు.. హెలికాప్టర్ సాయంతో మృతదేహాలను బయటకు తీసుకువచ్చినట్లు- సమాచారం. భారత్‌కు చెందిన విష్ణు ఇరిగిరెడ్డి సియాటెల్‌లో స్థిరపడ్డారు. గ్రేటర్ సియాటెల్‌లో ఉన్న ప్రముఖ ఎలక్ట్రానిక్ సంస్థ ఫ్లూక్ కార్పొరేషన్‌లో ఇంజినీరింగ్ విభాగానికి ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. అక్కడ పేరుగాంచిన నిపుణుల్లో ఒకడిగా గుర్తింపు పొందడంతో పాటు స్థానికంగా నిర్వహించే కార్యక్రమాల్లో క్రియాశీలంగా వ్యవహరించేవారు.

## సౌదీలో తెలంగాణ వాసి అనుమానాస్పద మృతి

సూర్యాపేట: సౌదీ అరేబియాలో కోదాడకు చెందిన వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. షేక్ తాజుద్దీన్ సౌదీలో పదేళ్లుగా కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 8న కాలిన గాయాలతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయాన్ని సౌదీ పోలీసులు ఆలస్యంగా తాజుద్దీన్ కుటు-ంబసభ్యులకు తెలియజేశారు. సౌదీలో కపిల్ అనే వ్యక్తితో తాజుద్దీన్‌కు కొద్ది రోజులుగా గొడవలున్నాయని, అతడే కాల్చి చంపి ఉంటాడని కుటు-ంబసభ్యులు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని కోదాడకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సాయం చేయాలని కోరుతున్నారు.

## 8వేల కోట్ల ఫీజు బకాయిలు

**హైదరాబాద్:** తక్షణమే ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రూ.8వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేటు- కళాశాలలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. ఇప్పటికే అనేక డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు మూతపడ్డాయి. కొన్ని కాలేజీలు ఫీజులు చెల్లించనిదే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వట్లేదు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు బండి సంజయ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలను ప్రభుత్వమే విస్మరించిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 8,000 కోట్ల ఫీజు బకాయిలు పేరుకుపోయాయని ఆయన లేఖలో పేర్కొన్నారు. బండి సంజయ్ పేర్కొన్న వివరాల ప్రకారం, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అధ్యాపకులకు జీతాలు, సిబ్బందికి భత్యాలు, కాలేజీల నిర్వహణ ఖర్చులు కూడా భరించలేని స్థితిలో ఉన్నాయని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు మూతపడటం ప్రారంభించాయని బండి సంజయ్ హెచ్చరించారు. విద్యార్థులకు ఫీజులు చెల్లించనిదే సర్టిఫికెట్లు- ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు, కళాశాల యాజమాన్యాల మధ్య వాగ్వాదాలు తీవ్రమై పోలీస్ స్టేషన్ల దాకా కేసులు వెళ్లుతున్నాయని అన్నారు.

అసెంబ్లీ సాక్షిగా ఫీజు బకాయిలను వన్ టైం సెటిల్ మెంట్ చేయాలని ఒకసారి, మరోసారి 12 వాయిదాల్లో చెల్లిస్తామని ముఖ్యమంత్రి మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ మాటలను విస్మరించడం దురదృష్టకరమని ఆయన విమర్శించారు. ఈ విద్యా సంవత్సరం నుండే బకాయిలను నిర్ణీత వ్యవధిలో చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. బండి సంజయ్ ప్రభుత్వానికి హితవు పలుకుతూ, విద్యార్థుల భవిష్యత్తును, కళాశాలల మనుగడను దృష్టిలో పెట్టు-కుని తక్షణమే బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యారంగంపై ప్రభుత్వం చూపుతున్న అలసత్వం లక్షలాది మంది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మానసిక క్షోభ కలిగిస్తోందని తీవ్రంగా విమర్శించారు.

## యాదాద్రిని దర్శించుకున్న సుందరాంగులు

### పోచంపల్లిలోనూ ఇక్కత్ చీరలపై మక్కువ

**యాదగిరిగుట్ట:** మిస్‌వరల్డ్ పోటీ కోసం హైదరాబాద్ చేరుకున్న అందగత్తెలు వివిధ ప్రాంతాలను సందర్శిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ గెస్ట్‌హౌస్ నుంచి బ్యాటరీ వాహనాల్లో చేరుకున్న సుందరీమణులు అఖండ దీపారాధన మండపంలో జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి వెంట ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కుటుంబ సభ్యులు, జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, ఆలయ ఏఈవో భాస్కర్ తదితరులు ఉన్నారు. అక్టోపస్, తెలంగాణ స్పెషల్ పోలీస్, ఆలయ ఎస్పీఎఫ్ సిబ్బంది భద్రతను పర్యవేక్షించారు. టూరిజం విలేజ్‌గా గుర్తింపు తెచ్చుకున్న పోచంపల్లిని ఆఫ్రికా ఖండానికి చెందిన 25 దేశాల మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించారు. వారికి స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఇక్కత్ చీరల ప్రత్యేకత, తయారీ విధానాన్ని విదేశీ అతిథులు పరిశీలించారు. పలువురు భామలు స్వయంగా చీరలను నేసి సంబరపడ్డారు.

## ఈ అధికారం మీకెవరు ఇచ్చారు?

**న్యూఢిలీ:** తమిళనాడు గవర్నర్ విషయంలో తీర్పుసందర్భంగా రాష్ట్రపతిని కూడా ప్రశ్నించిన సుప్రీం ధర్మాసనం తీరుపై రాష్ట్రపతి ముర్ము ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అధికారం మీకెవరు ఇచ్చారో చెప్పాలని స్పష్టం చేశారు. ఈ మేరకు పలు ప్రశ్నలను సంధించారు. శాసనసభలో ఆమోదించిన బిల్లులను పరిశీలన పేరుతో గవర్నర్లు, రాష్ట్రపతి నెలల తరబడి జాప్యం చేస్తుండటంపై ఇటీవల సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది.

తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ కేసులో ఏప్రిల్ 8న రాష్ట్రపతి, గవర్నర్లు గడువులోగా బిల్లులు ఆమోదించాల్సిదేనని ధర్మాసనం ఆదేశించింది. అయితే, తాజాగా అత్యున్నత న్యాయస్థానం నిర్ణయాన్ని భారత ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము తీవ్రంగా ఖండించారు. ఈ ఆదేశాలు రాజ్యాంగం ప్రకారం ఎలా చెల్లుబాటు అవుతాయని సుప్రీంను ప్రశ్నిస్తూ 14 ప్రశ్నలను సంధించారు. తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ కేసులో ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు రాష్ట్ర బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్ 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందేనని తీర్పు వెలువరించింది. గడువులోగా ఆమోదించడమో, వెనక్కి తిప్పిపంపడమో ఏదొకటి చేయాలని స్పష్టం చేసింది. బిల్లులు ఆమోదించకపోతే ఎందుకనే కారణాలు కచ్చితంగా చెప్పాలని తెలిపింది. ఈ తీర్పు తర్వాత కూడా ఇలాగే చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని, రాజ్యాంగ అధికరణం 142 ప్రకారం గవర్నర్ల నిష్క్రియాపరత్వాన్ని న్యాయ సమీక్ష చేసేందుకు సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జేబి పార్దివాలా, ఆర్ మహదేవన్ ధర్మాసనం వెల్లడించింది. అయితే, సుప్రీం ఇలా కాలపరిమితి విధించడంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేది లేనప్పుడు ఈ తీర్పు ఎలా ఇవ్వగలరని రాష్ట్రపతి ముర్ము అత్యున్నత న్యాయస్థానాన్ని ప్రశ్నించారు. జస్టిస్ జేబి పార్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ ఇచ్చిన 415 పేజీల తీర్పును సమీక్షించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 143(1) కింద రాష్ట్రపతికి ఉన్న అరుదైన అధికారాలను ఉపయోగించి 14 ప్రశ్నలపై సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు.

## రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన తప్ప ఏమీ లేదు

గుంటూరు: కొంతమంది పోలీస్ అధికారులు చట్టాన్ని అతిక్రమిస్తున్నారు.. వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదు.. నిబంధనలు అతిక్రమించిన పోలీసు అధికారులను ఎవర్నీ వదలం.. కచ్చితంగా చట్టం ముందు దోషులుగా నిలబెడతామని మాజీ మంత్రి అంబటి రాంబాబు హెచ్చరించారు.. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి కొద్ది రోజుల్లో సంవత్సరం కావస్తుంది.. వైసీపీ గత 5 ఏళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధి, విశ్వసనీయత, ప్రజల కొనుగోళ్లు అన్ని బాగున్నాయి.. రాష్ట్రం అభివృద్ధి చెందింది.. కూటమి ఏడాది పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రం తిరోగమనం దిశగా అడుగులు వేస్తుందని విమర్శించారు.. వైఎస్ జగన్ ను ఏ విధంగా ఇబ్బంది పెడదాం అనే ధ్యాస తప్ప ప్రభుత్వానికి ఏమీ లేదు.. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన తప్ప ఏమీ లేదు.. ప్రజలు సూపర్ సిక్స్ హామీలు ఎక్కడ అని ప్రశ్నిస్తున్నారని అంబటి అన్నారు.. వైఎస్ జగన్ మొదట బిజినెస్‌లో భాగంగా భారతి సిమెంట్ ను ప్రారంభించారు. లేని పోనీ కారణాలు చూపించి భారతి సిమెంట్ సంస్థ సెక్రెటరీ బాలాజీ గోవిందప్పను విజయవాడ జైలుకు పంపిస్తున్నారని ఆరోపించారు అంబటి రాంబాబు.. దేశంలో ఎక్కడ లేని విధంగా ఐజీ స్థాయి వ్యక్తిని అరెస్ట్ చేస్తున్నారు. ఈ విధంగా ఇండస్ట్రీ ప్రతినిధులను భయపెడితే ఏ విధంగా ఏపీకి పరిశ్రమలు వస్తాయి.? అని ప్రశ్నించారు.. రౌడీ మాములు ఇవ్వకపోతే పరిశ్రమలకు అనుమతులు ఇవ్వమని కూటమి ప్రజా ప్రతినిధులు తెగేసి చెప్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రజా ప్రతినిధులు బరితెగించి మరి దోచుకుంటు-న్నారు. కప్పం కట్టలేదని పల్నాడు జిల్లాలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రెండు సిమెంట్ కంపెనీలు

మూసేయించాడు అని ఫైర్ అయ్యారు.. జాతీయ రహదారి కాంట్రాక్ట్ ల కోసం సీఎం రమేష్ , నారాయణరెడ్డి లాంటి పెద్ద పెద్ద నాయకులు కొట్టుకుంటున్నారు. దౌర్జన్యాలు, దుర్మార్గాలు చేసి, ఏడాది పాలన పూర్తి చేశారు. ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఎందుకు ఓటు- వేశామని బాధ పడుతున్నారు.. గత ఐదేళ్ల వైసీపీనే బాగుంది అని ప్రజలు చెప్పుకుంటు-న్నారని వ్యాఖ్యానించారు.. ఇక, రాష్ట్రంలో అన్ని రంగాల అభివృద్ధి రెవిన్యూ తగ్గిపోయిందన్న రాంబాబు.. మోసానికి మారుపేరు చంద్రబాబు. అసలు ఒక పథకం అమలు చేయడానికి ఎంత బడ్జెట్ కావాలి, మీరు కేటాయిస్తుంది ఎంత..? అని ప్రశ్నించారు.. ప్రజలు మిమ్మల్ని ఎందుకు నమ్మాలని మాజీ మంత్రి అంబటి రాంబాబు నిలదీశారు..

## రెడ్ బుక్‌ను వదిలేది లేదు

అనంతపురం: రెడ్ బుక్ మరువను... కేడర్‌ను ఇబ్బంది పెట్టిన వారిని వదలనని అంటూ మంత్రి నారా లోకేష్ మరోసారి స్పష్టం చేశారు..ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేయలేనిది 11నెలలో చేసి చూపించాం అని లోకేష్ అన్నారు.. కరెంటు చార్జీలు పెంచమని చెప్పాం. జగన్ నిర్వాకం వల్లే ట్రూ అప్ చార్జీలు వేయాల్సి వస్తోంది. దీనిపై మనం మాట్లాడకపోతే దెబ్బతింటాం. 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ ఇచ్చాం. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రానికి పెద్దఎత్తున కంపెనీలు వస్తున్నాయి. అనంతపురానికి రూ. 22వేల కోట్ల విలువైన భారీ సోలార్ విండ్ ప్రాజెక్టు వస్తోంది. విశాఖకు టీసీఎస్ డెవలప్ మెంట్ సెంటర్ వస్తోంది. రాబోయే ఐదేళ్లలో మనపిల్లలకు ఉద్యోగాలు వస్తాయన్నారు.. ప్రతి కార్యకర్త మన ప్రభుత్వం చేసింది చెప్పుకోవాలి, భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా 4వేల పెన్షన్ ఇవ్వడం లేదు. అవ్వతాతలకు అండగా నిలిచేందుకే పెన్షన్ పెంచాం, ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నాం. వాటిగురించి పార్టీ కార్యకర్తలంతా ప్రజల్లోకి వెళ్లి మాట్లాడాలని పిలుపునిచ్చారు.. గుంతకల్లు నియోజకవర్గం గుత్తి సమీపంలోని రామరాజుపల్లిలో ఉత్తమ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న లోకేష్.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే కసితో పనిచేయాలి. బాబు సూపర్ - 6, బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ-లో పార్టీ తరపున పలు హామీలు ఇచ్చాం. ఒక్కొక్కటిగా వాటిని అమలుచేసేందుకు చర్యలు తీసుకుంటు-న్నాం. 11 నెలల ప్రజాప్రభుత్వంలో వృద్ధాప్య పెన్షన్ 4వేలకు, వికలాంగ పెన్షన్ 6వేలకు పెంచాం. రాష్ట్రవ్యాప్తంగా పేదల ఆకలితీర్చే అన్నక్యాంటీ-న్లు ప్రారంభించాం. ఉచిత గ్యాస్ పథకాన్ని అమలు చేస్తున్నాం. ఈ పథకంలో నిబంధనలు సడలించి లబ్ధిదారుల ఎకౌంట్ లో నేరుగా డబ్బులు చేయాలని నిర్ణయించాం. మత్స్యకారులకు ఆర్థికసాయం అందించాం, చేనేతలకు 200 యూనిట్ల విద్యుత్ ఇచ్చాం. రోడ్లపై గుంతలన్నీ పూడ్చుకుంటూ వస్తున్నాం. జూన్ మాసంలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు ఇస్తాం. ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తూ ముందుకెళ్తున్నాం అని తెలిపారు.. అయితే, మన ప్రభుత్వం స్కూళ్లు మూసివేస్తుందని వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు నారా లోకేష్. ఒక్క పాఠశాలను కూడా మూయడం లేదు. అది మన లక్ష్యం కాదు. ఒక క్లాస్ కు ఒక టీచర్ ఉండాలన్నదే మన ధ్యేయం. మన ప్రభుత్వంలో వచ్చేనాటికి కేవలం 1200 స్కూళ్లలో క్లాసుకో టీచర్ ఉంటే, ఇప్పుడు 9800 మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఉన్నాయి. గతంలో ప్రభుత్వ స్కూళ్లలో 45లక్షల మంది విద్యార్థులు ఉండగా, ఇప్పుడు 33లక్షలకు పడిపోయారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతాం. మంత్రి నారాయణ సహకారంతో ప్రభుత్వ జూనియర్ కాలేజిల్లో మంచి ఫలితాలు వచ్చాయి. మన ప్రభుత్వం జూన్ మాసానికి సంవత్సరం అవుతుంది. జూన్ నుంచి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ఇస్తాం. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా అన్నీచేస్తాం. బీజేపీ, జనసేన పార్టీతో కలిసి పొత్తుతో పోటీ-చేశాం. నామినేటెడ్ పదవుల విషయంలో వారితో మాట్లాడి పదవులు ఇస్తున్నాం. కొందరు వైసీపీ వాళ్లు అపోహలు సృష్టిస్తున్నారు, వక్ఫ్ సవరణలు ప్రతిపాదించి ముస్లిం సోదరులకు అండగా నిలిచాం. ఎవరికీ ఇబ్బంది లేకుండా చూసుకునే బాధ్యత టీడీపీ చూసుకుంటుంది. జనసేనతో కలిసి పోటీ- చేశాం, భవిష్యత్తులో కలిసే ప్రయాణం చేస్తాం, మా మధ్య ఎలాంటి అరమరికలు లేవు అని స్పష్టం చేశారు..దేశవ్యాప్తంగా విశాఖ స్టీల్ తప్ప అన్ని ప్రైవేటీకరిస్తున్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు సాయం చేస్తున్నారు. వైసీపీ వాళ్లు చిచ్చుపెట్టాలని చూస్తారు, సమర్థవంతంగా తిప్పికొట్టండి అని లోకేష్ పిలుపునిచ్చారు.. పార్టీ ఆవిర్భావం తర్వాత ఎప్పుడూ లేనివిధంగా ప్రజలు కూటమికి 94శాతం సీట్లు- ఇచ్చారు. సునామీ మాదిరి ప్రజలు ఇచ్చిన తీర్పుతో చరిత్ర తిరగరాశాం,

దీనివెనుక కార్యకర్తల కష్టం, త్యాగాలు ఉన్నాయి. నాలుగున్నర దశాబ్దాల్లో అధికారం, ప్రతిపక్షం రెండూ చూశాం. అయితే గత అయిదేళ్ల లాంటి అరాచక పాలన ఇదివరకెన్నడూ చూడలేదన్నారు.. ఇక, టీడీపీ రెండేళ్లకోసారి చేపట్టే సభ్యత్వం గతంలో ఎన్నడూ లేనివిధంగా చేసి చూపించారు. భారత్ లో ఏ పార్టీకి లేనివిధంగా కోటి సభ్యత్వాలు టీ-డీపీకే సొంతం. దానికి కార్యకర్తల కష్టమే కారణం. కార్యకర్తల బీమాను అయిదులక్షలకు పెంచాం, పేదపిల్లలకు నిరంతరం ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఉచిత విద్య అందిస్తున్నాం. కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటాం అన్నారు...ఇక, పార్టీ కేడర్ ఎర్ర బుక్ గురించి అడుగుతున్నారు. మన కార్యకర్తలను ఇబ్బందులు పెట్టిన వారిని వదలను.. నా అంతట నేనుగా ఎవరితో గొడవపెట్టు-కోను, మన జోలికి వస్తే మాత్రం వదలను అంటూ హెచ్చరించారు నారా లోకేష్. గత ప్రభుత్వంలో మద్యంలో ఎంత కుంభకోణం జరిగిందో రాష్ట్రమంతా చూస్తున్నారు. ప్రజలను చైతన్య వంతులను చేసి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో కొంచెం సమయం ప-÷-టటొ-చ్చు. కార్యకర్తలు అహంకారం లేకుండా ప్రజల్లోకి వెళ్లి వారి చుట్టూ తిరగాలన్నారు.. పార్టీ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు కేడర్ కు చేరవేసేందుకు మహానాడు తర్వాత కొత్త యాప్ పై టీడీపీ పేరుతో కొత్త యాప్ విడుదల చేస్తాం. కెఎస్ఎస్, బూత్, క్లస్టర్, అందరికీ ఒకే యాప్ ద్వారా కార్యక్రమాలపై సందేశాలు పంపిస్తాం. ఈనెల 18,19,20 నియోజకవర్గ స్థాయిలో మినీ మహానాడు జరుగుతుంది. 27,28, 29 కడపలో మన పెద్దపండుగ మహానాడు జరుగుతుంది. ఈ కార్యక్రమంలో కార్యకర్తలంతా ఉత్సాహంగా పాల్గొనాలని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు..

## వక్ఫ్ సవరణ బిల్లు చెల్లుబాటు కేసు

న్యూఢిల్లీ:వక్ఫ్ సవరణ చట్టం 2025 రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లపై మే 20న విచారణ చేపడతామని సుప్రీంకోర్టు గురువారం వెల్లడించింది. ఈ కేసులో మధ్యంతర ఉపశమనం అవసరమా కాదా అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ ఎ.జి.మసిహ్‌లతో కూడిన ధర్మాసనం పరిశీలించనుంది. అప్పటివరకు, కేంద్ర ప్రభుత్వం చట్టంలోని నిబంధనలు అమలు చేయదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఇచ్చిన హామీ కొనసాగుతుందని ధర్మాసనం తెలిపింది. ఈ పిటిషన్‌ల విచారణ నుండి భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా తప్పుకున్న సంగతి తెలిసిందే. ఈ నెల 13న తాను పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఈ అంశంపై ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులను జారీ చేయాలనుకోవడం లేదని లేదా రిజర్వ్ చేయాలని కూడా అనుకోవడం లేదని మే 5న విచారణ సందర్భంగా జస్టిస్ సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు. ఈ వక్ఫ్ సవరణ చట్టాన్ని సవలు చేస్తున్న పిటిషన్‌లపై తదుపరి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ బి.ఆర్.గవారు నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపడుతుందని అన్నారు. విచారణను నేటికి వాయిదే వేశారు.

## ఉగ్రవాదాన్ని శాశ్వతంగా నిలిపివేయాల్సిందే

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ తర్వాత, భారత్‌కు అంతర్జాతీయ సమాజం నుంచి మంచి మద్దతు లభిస్తుందని భారత విదేశాంగమంత్రి ఎస్ జై శంకర్ అన్నారు. పహల్గామ్ దాడి తర్వాత, భారతదేశం సింధు జల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ నిర్ణయంపై మాట్లాడుతూ పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని శాశ్వతంగా నిలిపివేసే వరకూ ఈ ఒప్పందం నిలిపివేయబడుతుందన్నారు. ఈ క్రమంలో కశ్మీర్‌పై చర్చించాల్సిన ఒకే ఒక అంశం ఉందన్నారు. అది పాకిస్థాన్ అక్రమంగా ఆక్రమించిన భారత భూభాగాన్ని ఖాళీ చేయడం. దీని గురించి చర్చకు మేము సిద్ధంగా ఉన్నామని జైశంకర్ మరోసారి స్పష్టం చేశారు.

కశ్మీర్ సమస్యపై ఎస్.జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంలో మూడో దేశం జోక్యం అవసరం లేదని, ఇది భారత్-పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక అంశమని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం పాకిస్థాన్ ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసినట్లు కేంద్రమంత్రి చెప్పారు. పాకిస్థాన్ సైన్యాన్ని కాకుండా,ఉగ్రవాద కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నామని ముందే హెచ్చరించినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ, పాకిస్థాన్ ఈ సలహాను పట్టించుకోలేదన్నారు. భారతదేశంపై చేసిన దాడికి మా సైన్యం గట్టి ప్రతీకారం తీర్చుకుందన్నారు. శాటిలైట్ చిత్రాలు ఈ ఆపరేషన్‌లో పాకిస్థాన్‌కు జరిగిన భారీ నష్టాన్ని, భారతదేశానికి అతి తక్కువ నష్టాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయని జైశంకర్ గుర్తు చేశారు. ఈ ఆపరేషన్ ద్వారా భారత సైన్యం తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిందన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత తీవ్రవాద రెసిస్టెన్స్ ఫ్రంట్ ఉగ్రవాద సంస్థను నిషేధించాలని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్ డిమాండ్ చేసింది. ఈ సంస్థకు వ్యతిరేకంగా ఆధారాలను సమర్పించేందుకు భారత్ సిద్ధంగా ఉంది.

# తూకివాకంలోని ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ను జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య తో కలిసి సందర్శించిన 16వ ఆర్థిక కమిషన్ మెంబర్ సౌమ్య కంటి ఘోష్

**తూకివాకంలోని ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ నిర్వహణ బాగుంది. - 16వ ఆర్థిక కమిషన్ మెంబర్ సౌమ్య కంటి ఘోష్**




**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి,మే 15 :**

తూకివాకంలో తిరుపతి తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ నిర్వహణ బాగుందని 16వ ఆర్థిక కమిషన్ సభ్యులు సౌమ్య కంటి ఘోష్ అన్నారు. గురువారం ఉదయం తూకివాకం నందలి తిరుపతి నగరపాలక సంస్థ నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ (చెత్త నుండి సంపద కేంద్రం) ను జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య తో కలిసి పరిశీలించిన 16వ ఆర్థిక కమిషన్ బృంద సభ్యులు సౌమ్య కంటి ఘోష్, సెక్రటరీ గౌతమ్ అల్లాడ. ఈ ప్లాంట్ నందు ఘన వ్యర్థాల నిర్వహణ, తడి చెత్త నిర్వహణ కంపోస్టు, బయో మెథనైజేషన్ ప్లాంట్, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ తదితర యూనిట్ల నిర్వహణ గురించి తిరుపతి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ శ్రీమతి మౌర్య పలు అంశాలు వివరించారు. ఈ ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా నగరంలో ఏర్పడిన అన్ని రకాల చెత్తను, మురుగునీటిని నిర్వహణ చేసి సంపద సృష్టించే విధానం గురించి వివరించారు. తిరుపతి నగరంలో సేకరించిన తడి, పొడి చెత్త ద్వారా ఏర్పడిన పొడి చెత్త నిర్వహణ చేస్తారని, ఇందులో వచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలు తదితరాలను ప్రాసెసింగ్ చేసి సిమెంట్ ఫ్యాక్టరీలకు విక్రయిస్తారని, తడి చెత్త ను నిర్వహణ చేసి కంపోస్టు ఎరువుగా మార్చి రైతులకు, ఉద్యానవనాలకు విక్రయిస్తారని, ఇక మార్కెట్ నుండి వెలువడే వ్యర్థాలు, హోటల్స్ నుండి సేకరించిన వ్యర్థాలను నిర్వహణ చేసి వంట గ్యాస్ ను ఉత్పత్తి చేసి విక్రయించడం జరుగుతుందని తెలిపారు. నగరంలో ప్రతిరోజూ ఉత్పతి అయ్యే సుమారు 25 టన్నుల భవన నిర్మాణ వ్యర్థాలను నిర్వహణ చేసి ఆరు రకాలుగా గుల్ల, ఇసుకగా మారుస్తారని, ఇలా ఉత్పతి అయిన ఇసుక గుల్ల తో పేవర్స్ తయారు చేస్తారని తెలిపారు. ప్రతిరోజూ తడి చెత్త 150 టన్నులు, 75 టన్నులు పొడి చెత్త నిర్వహణ చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే ట్రీటెడ్ వేస్ట్ నీటిని పరిశ్రమలకు విక్రయించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, లైజన్ అధికారులు పాల్గొన్నారు.

# టీటీడీకి రూ.1.40కోట్లు విరాళం



**తిరుమల,ఉత్తేజిత ప్రతినిధి, మే 15.**

టీటీడీలోని వివిధ ట్రస్టులకు గురువారం రూ. 1.40కోట్లు విరాళంగా అందింది. అమెరికాలోని బోస్టన్ కు చెందిన ఎన్ఆర్ఐ దాత భాగవతుల ఆనంద్ మోహన్ ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్ కు రూ. 1,00,01,116, ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్ కు రూ. 10,01,116, ఎస్వీ విద్యాదాన ట్రస్ట్ కు రూ. 10,01,116, ఎస్వీ వేదపరిరక్షణ ట్రస్ట్ కు రూ. 10,01,116, ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్ట్ కు రూ. 10,01,116 లు విరాళం అందజేశారు. ఈ మేరకు తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ శ్రీ బీ.ఆర్. నాయుడుకు విరాళం డీడీలను అందజేశారు. ఈ సందర్భంగా దాతను చైర్మన్ అభినందించారు.

# గుర్తింపు కార్డు, వెండింగ్ సర్టిఫికేట్ ఇవ్వడును




**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూర్ మే 15:**

నందికొట్కూరు పట్టణంలో వీధి వ్యాపారం చేసుకుంటున్న వారందరూ సంక్షేమ కార్యదర్శుల ద్వారా చేపట్టిన సర్వేలో నమోదు చేసుకోవాలని నందికొట్కూరు పురపాలక కమీషనర్ ఎస్. బేబీ తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా వీధి వ్యాపారుల కోసం స్మార్ట్ స్ట్రీట్ ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, అందులో వీధి వ్యాపారులను గుర్తించి, వారికి గుర్తింపు కార్డు, వెండింగ్ సర్టిఫికేట్ ఇవ్వడం జరుగుతుందన్నారు.
మంగళవారం నుండి ప్రారంభమైన ఈ సర్వే ఈ నెల 19 వరకు జరుగుతుందని, వీధి వ్యాపారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాల కోసం స్థానిక సచివాలయం లో సంక్షేమ కార్యదర్శిని సంప్రదించాలని కమీషనర్ వీధి వ్యాపారులకు సూచించారు.

# గ్రామీణ , పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధులతో సమావేశమైన 16వ ఆర్థిక సంఘం సభ్యులు సౌమ్య కంటి ఘోష్




**స్థానిక సంస్థల అబివృద్ధి కోసం నిధులు కేటాయించాలని 16వ ఆర్థిక సంఘం సభ్యులును కోరిన గ్రామీణ , పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధులు**

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి ,మే 15**

స్థానిక సంస్థల మౌలిక సదుపాయాల కల్పన, అబివృద్ధి కోసం నిధులు కేటాయించాలని 16వ ఆర్థిక సంఘం సభ్యులు అయిన సౌమ్య కంటి ఘోష్ ను కోరిన గ్రామీణ ప్రాంతాల స్థానిక సంస్థల ప్రతినిధులు, పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధులు. గురువారం స్థానిక తాజ్ హోటల్ నందు పట్టణ స్థానిక సంస్థల అబివృద్ధి పనులలో భాగంగా శానిటేషన్, రోడ్లు , త్రాగు నీరు, డ్రైనేజీ మొదలగు అంశాలపై గ్రామీణ ప్రాంతాల స్థానిక సంస్థల ప్రతినిధులు, పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధులుతో సమావేశమైన 16వ ఆర్థిక సంఘం సభ్యులు సౌమ్య కంటి ఘోష్,ఆర్థిక సంఘం జాయింట్ సెక్రటరీ ఎస్.గౌతమ్ అల్లాడ. C&DMD% డైరెక్టర్ పి. సంపత్ కుమార్, పి ఆర్ అండ్ ఆర్ డి అడిషనల్ కమిషనర్ ఎం. సుధాకర్ రావు, జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య పాల్గొన్నారు. గ్రామాల అబివృద్దే లక్ష్యంగా.. గ్రామాలలో అనేక అబివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, వివరిస్తూ..స్థానిక సంస్థలకు అవసరమైన తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రహదారుల నిర్మాణం, రవాణా, వీధి లైట్లు, మురుగునీటి పారుదల వ్యవస్థ, మౌలిక సదుపాయాల కల్పనకు, గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు తదితర ముఖ్యమైన అంశాలపై కేంద్రం నుండి నిధుల విడుదల కోసం, ఆర్థిక సాయం కొరకు కమిషన్ దృష్టికి గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు తీసుకెళ్ళారు. గ్రామాలు అబివృద్ధి కి మరిన్ని నిధులు కేటాయించడం వలన గ్రామాలు మరింత అబివృద్ధి చెందే అవకాశం ఉంటుందని తెలిపారు. టైడ్ మరియు అన్ టైడ్
నిధులు వేరుగా కాకుండా ఒకే మొత్తంలో నిధులు కేటాయించాలని ఆర్థిక సంఘం సభ్యులను కోరారు. 2011 జనాభా లెక్కల ప్రాతిపదిక కాకుండా ప్రస్తుతం జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల స్థానిక సంస్థల ప్రతినిధులు, పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధుల సూచనలు, అభిప్రాయాలను కమిషన్ పరిశీలిస్తుందని ఈ సందర్భంగా 16 వ ఆర్థిక సంఘం సభ్యులు తెలిపారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల గ్రామీణ స్థానిక సంస్థల నుండి సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ లు గ్రామీణ, పట్టణ ప్రతినిధులు మునిసిపల్ మేయర్, చైర్మన్ లు పాల్గొన్నారు. జడ్పీ సీఈవో రవి కుమార్ నాయుడు , డిప్యూటీ సి .ఈ. ఓ జుబేదా, డి.పి. ఓ సుశీల దేవి, శ్రీ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి ఆర్థిక సంఘం సెక్షన్ అధికారులు రాజశేఖర్, భూషణ రావు, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

# శాంతి మంత్రాలకు చింతకాయలు రాలవు!

భారత్‌తో యుద్ధం గెలిచామని తమ సొంత ప్రజలను నమ్మించేందుకు పాక్ చేయని ప్రయత్నం లేదు. చివరకు విజయోత్సవాలను కూడా నిర్వహించుకుంది. ట్రంప్ కూడా తనవల్లనే యుద్ధం ఆగిందని ప్రచారం చేసుకుంటున్నారు. ప్రచార కండూతి ఇద్దరిలోనూ కనిపిస్తోంది. అయితే ఇందులో ఏది నిజమో భారత్‌ను చూస్తే తెలుస్తుంది. పాక్ ఎందుకు కాళ్లబేరానికి వచ్చిందో చెప్పాలి. ప్రపంచాన్ని బెదిరించి పబ్బం గడుపు కునే దుస్థితిలో ట్రంప్ ఉన్నారు. అడుక్కుతినే దుస్థితిలో పాక్ ఉంది. పాక్ ముందు నుంచి నిజాయితీ ఉన్ దేశంగా పేరు సంపాదించుకోలేదు. యుద్ధాన్ని తానే ఆపానని ఓ వైపు డొనాల్డ్ ట్రంప్ ప్రచారం చేసుకుం టుంటే...మరో వైపు పాకిస్తాన్ తామే యుద్ధంలో గెలిచామని ప్రచారం చేసుకుంటోంది. డొనాల్డ్ ట్రంప్, పాకిస్తాన్‌లు చేసుకుంటున్న ప్రచారంపై అమెరికాతో సహ ప్రపంచ దేశాలు నివ్వెరపోయి చూస్తున్నాయి. భారత్ దెబ్బకు దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అయిన పాక్..నిజాయితీగా బతకాలన్న ఆలోచన చేయడం లేదు. ఇండియా పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం కాల్పులు మొదలైన మూడు రోజులకే ముగిసిన సంగతి తెలిసిందే. ఎందుకు ముగిసాయన్నది పాక్‌కు బాగా తెలుసు. భారత్ కొట్టిన దెబ్బకు పాక్ కూసాలు కదిలిపోయాయి. మిస్సైల్స్, డ్రోన్ల దాడి కారణంగా భారీ ఆస్తినష్టం సంభవించింది. ఒకరకంగా పాక్‌పై కోలుకోలేని దెబ్బ పడింది. యుద్ధం ఇలాగే కొనసాగితే దేశం సర్వ నాశనం అవుతుందని పాక్ భావించింది. వెంటనే కాళ్ల బేరానికి వచ్చింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సాయంతో కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీంతో కాల్పుల కొనసాగింపు ఆగిపోయింది. అయితే భారత్ మాత్రం ఆపరేషన్ సింధూర్ నిలిచి పోయిందని, ఎప్ఉడైనా కొనసాగుతుందని గట్టిగా హెచ్చరించింది. మోడీ జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగం తరవాత దేశంతో పాటు, ప్రపంచానికి కూడా భారత్ సత్తా ఏమిటో మరోమారు తెలిసిపోయింది. ఇండియా దెబ్బకు తోకముడిచిన కుక్కలా పాకిస్తాన్ బిక్కచచ్చిపోయింది. దాడులు, కాల్పుల విరమణ కోసం పరుగులు తీసింది. యుద్ధంలో పాకిస్తాన్ దారుణంగా దెబ్బతింది. ఇండియా డిప్లమేటిక్‌గా.. మిలటరీ పరంగా విజయం సాధించింది. ఇండియా ఎందుకు విజయం సాధించిందనే దానికి పటిష్టమైన నాయకత్వం, మిటిటరీ ఆధునీకరణ అని చెప్పక తప్పదు. గత కొన్ని వేల సంవత్సరాలుగా పరాయి పాలనలో మగ్గిన భారత్ స్వయం సమృద్ధి సాధించి, సైనికంగా బలోపేతం అయ్యింది. ఎదుటి వారు దాడిచేస్తే దెబ్బ కొట్టాల్సిందేనన్న లక్ష్యంతో పనిచేస్తోంది. చెంపకుచెంప కాదు...కాళ్లు విరగ్గొడతామన్న ధైర్యాన్ని చూపిస్తోంది. ఈ విషయం పాకిస్తాన్‌కే బాగా తెలుసు. వరుసగా ఉగ్రదాడులతో భారత్‌ను దెబ్బకొట్టాలని చూసిన పాక్ ఇప్పుడు దెబ్బతింది. ఇక జీవితంలో మరువలేని అనుభవాన్ని సంపాదించింది. ఇకనుంచి ఉగ్రదాడులకు దాడులతోనే భారత్ సమాధానం చెబుతుందన్న విషయం ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ఇకపోతే ఇప్పుడు అందరి చూపు.. పాకిస్తాన్ టెర్రరిస్టులను పెంచి పోషిస్తున్న విషయం వైపే ఉంది. టెర్రరిస్టులు చనిపోయినపుడు ఆర్మీ అధికారులు యూనిఫామ్‌లో అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అంటే దానర్థం.. అక్కడి టెర్రరిస్టులకు.. ఆర్మీ వాళ్లకు తేడా లేదని. పాక్ చరిత్ర గురించి బాగా తెలిసిన వారు..ఈ రెంటికీ విడదీయరాని సంబంధం ఉందని గుర్తించారు. ఇండియాతో యుద్ధం చేసి ఓడిపోయిన ప్రతీసారి తామే గెలిచామని పాకిస్తాన్ జబ్బలు చరుచుకుంటోంది. అందుకే ఉగ్రవాదులకు ఊతమిచ్చే చర్యలను పక్కన పెట్టి పాకిస్తాన్ తన సొంత ఇంటిని శుభ్రం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇక బంగ్లా యుద్ధంనాటి 1971తో పోల్చితే మన దేశం ఆర్థికంగా ఎన్నో రెట్లు బలపడింది. మన సైనిక శక్తి పాటవాలు కూడా అనేక రెట్లు పెరిగాయి. అందుకే డ్రోన్లు, క్షిపణులతో పాకిస్థాన్ దాడులు చేసినప్పటికీ సమర్థంగా తిప్పి కొట్టాం.
అలాగే ప్రతిదాడితో దాని పక్కటెముకలను విరగొట్టాం. మనవైపు చెప్పుకోదగిన నష్టం ఏమీ జరగలేదు. అంతర్జాతీయ సమీకరణాలు... 1971లో పాక్‌కు దన్నుగా అమెరికా, బ్రిటన్, చైనా వంటి దేశాలు నిలవగా... మన దేశానికి సమైక్య రష్యా మాత్రమే అండగా ఉండింది. ఇప్పుడు వాతావరణం మారింది. భారత్ శాస్త్ర సాంకేతికరంగంలో దూసుకు పోతోంది. భారతదేశం కూడా బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతోంది. దీంతో భారత్ నుంచి ముప్పు తప్పదని భావించిన చైనా మనతో శత్రుత్వం పెంచుకుంటోంది. చైనాకు సామంత దేశంగా ఉండటానికి భారత్ ఎప్పటికీ అంగీకరించదు. ఈ కారణంగా చైనా వ్యూహాత్మకం గా పాకిస్థాన్‌ను చేరదీస్తోంది. దాయాది దేశానికి వివిధ రూపాల్లో సహాయం చేస్తోంది. మొన్నటికి మొన్న కూడా సైనికి సాయం చేసి భంగపడింది. అందుకే అరుణాల్ విషయంలో పేచీలు పటెట్ఇ కెలక్కుంటోంది. ఇక అమెరికా కూడా చైనా ఎదుగుదలను నిరోధించే క్రమంలో దానితో సై అంటోంది. భవిష్యత్తులో చైనాతో తలపడాల్సి వస్తే భౌగోళికంగా పాక్ భూభాగం అమెరికాకు కావాలి. ఈ కారణంగా ఉగ్రవాదంపై తమది రాజీ లేని పోరు అంటూనే అమెరికా దొడ్డి దారిన పాకిస్థాన్‌కు సహాయం చేస్తోంది. ఈ నేపథ్యంలో
సైనికపరంగా అత్యంత శక్తిమంతంగా ఉన్న రష్యా మాత్రమే ఎప్పటికైనా మనకు అంతో ఇంతో అండగా నిలవొచ్చు. పశ్చిమ దేశాలతో ఉన్న వైరం కారణంగా రష్యా కూడా చైనాకు పూర్తి వ్యతిరేకంగా వ్యవహరించే పరిస్థితి లేదు. ఈ కారణంగానే ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్థాన్‌కు ఆర్థిక సహాయం చేయవద్దని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థకు భారత్ విజ్ఞప్తి చేసినా..డే వంద కోట్ల డాలర్ల సహాయం అందించడానికి అంగీకారం తెలిపింది. యుద్ధాలను భరించే స్థితిలో ప్రపంచ దేశాలు ఇప్పుడు లేవు.
ఐదు దశాబ్దాల క్రితం పరిస్థితులు వేరు. అప్పుడు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కూడా లేవు. 1971 యుద్ధ సమయంలో అంతర్జాతీయ పరిణామాలు మన దేశ ప్రజలపై ప్రభావం చూపలేదు. ఇప్పుడు మన దేశం నుంచి ఎగుమతులు, దిగుమ తులు కూడా పెరిగాయి. ఇప్పుడంతా అభివృద్ధి, ఆర్థిక వృద్ధిపైనే అన్ని దేశాలు దృష్టి సారిస్తున్నాయి. పాక్ ఇందుకు భిన్నంగా ఉగ్రవాదులను ఎగదోస్తోంది. ఇలా ఎంతకాలం చేసినా అది మనుగడ సాగించదని గుర్తిస్తే మంచింది. అలా అని పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పకుండా ఉండలేం. మన దేశంతో యుద్ధం చేసి నెగ్గలేని పాకిస్థాన్ ఉగ్ర మూకలను పెంచి పోషించి మనపైకి ఉసిగొల్పుతోంది. తృతీయ ఆర్థిక శక్తిగా ఎదగాలను కుంటున్న భారత్‌కు ఈ యుద్ధం ప్రతిబంధకమే అవుతుంది. అలా అని చేతులు ముడుచుకొని కూర్చోలేని స్థితి.

# పాక్ అణ్వాయుధాల గుట్టు తేల్చాలి



న్యూఢిల్లీ: బాధ్యతలేని, దుష్ట పాకిస్థాన్ వద్ద అణ్వాయుధాలు ఉండడం ఎంత వరకు క్షేమం అని ప్రపంచ దేశాల్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశ్నించారు. కాశ్మీర్‌లో పర్యటించిన సందర్భంగా
శ్రీనగర్‌లోని బాదామి బాగ్ కంటోన్మెంట్‌లో గురువారం ఆయన మాట్లాడారు. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్ వద్ద న్యూక్లియర్ ఆయుధాలు ఉండడం ఎంత వరకు సమంజసం అని రాజ్‌నాథ్ అడిగారు. అంతర్జాతీయ అణు ఇంధన ఏజెన్సీ .. పాకిస్థాన్ అణ్వాయుధాలను తన ఆధీనంలోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో జరిగిన దాడిలో.. కిరానా హిల్స్ సమీపంలోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌ను భారతీయ వైమానిక దళాలు దాడి చేశాయి. అయితే ఆ ఎయిర్‌బేస్ వద్ద న్యూక్లియర్ వార్‌హెడ్స్‌ను పాకిస్థాన్ దాచిపెట్టినట్లు తెలుస్తోంది. దాడి జరగడం వల్ల ఆ న్యూక్లియర్ వార్‌హెడ్స్ నుంచి అణుధార్మికత రిలీజ్ అవుతున్నట్లు- ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో శ్రీనగర్ పర్యటనలో రక్షణ మంత్రి తన ప్రసంగంలో ఆ అంశాన్ని ప్రస్తావించారు. పెహల్గామ్ దాడి తర్వాత జమ్మూకశ్మీర్ ప్రజల్లో పాకిస్థాన్, ఉగ్రవాదులపై ఆగ్రహం వ్యక్తం అయ్యిందని, జమ్మూకశ్మీర్ ప్రజలకు సెల్యూట్ చేస్తున్నానని, శత్రువులను నాశనం చేసిన శక్తి ఇక్కడ ఉందని, పాకిస్థానీ చౌకీలు, బంకర్లను ధ్వంసం చేసిన తీరుతో శత్రుదేశం షాక్‌కు గురైందన్నారు. కిష్టమైన పరిస్థితుల్లో ఇక్కడ మీతో ఉండడం గర్వంగా భావిస్తున్నానని, ఆపరేషన్ సింధూర్ సమయంలో మీరు చేసిన పని పట్ల దేశం గర్వంగా ఉందన్నారు. రక్షణ మంత్రి కన్నా ముందు తాను దేశ పౌరుడినని, ఓ మంత్రిగానే కాకుండా, ఓ పౌరుడిగా ధన్యవాదాలు చెబుతున్నట్లు రాజ్‌నాథ్ పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో పర్యటిస్తున్న రాజ్‌నాథ్‌కు ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది స్వాగతం పలికారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ మాట్లాడుతూ.. ఉగ్ర శిబిరాలు ఎక్కడ ఉన్నా నాశనం చేస్తామని చెప్పారు. -టె-ర్రరిస్టులతో పోరాడి ప్రాణత్యాగాలు చేసిన జవాన్లకు శిరస్సు వంచి నివాళులర్పిస్తున్నట్లు- పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ అనేది కేవలం ఒక పేరు మాత్రమే కాదని.. అదొక కమిట్‌మెంట్ అని పేర్కొన్నారు. భారత్‌పై ఉగ్రదాడి జరిగితే.. దానిని యుద్ధ చర్యగానే పరిగణిస్తామన్నారు. మన దళాలు అద్భుతంగా పోరాడుతున్నాయని పేర్కొన్నారు. ఇంతటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా వారి మధ్య ఉన్నందుకు గర్వంగా ఉందని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి మృతులకు ఆయన నివాళులర్పించారు. ఇక ఈ పర్యటనలో భాగంగా పాకిస్థాన్ షెల్లింగ్‌లో దెబ్బతిన్న ప్రాంతాలను ఆయన సందర్శించారు. ఇక మన దళాల సంసిద్ధతను ఆయన పర్యవేక్షించనున్నారు. దీనిలోభాగంగా చినార్ కోర్ ప్రధాన కార్యాలయాన్ని ఆయన సందర్శించి.. ఆర్మీ,



వాయుసేన సిబ్బందితో మాట్లాడనున్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత రక్షణ మంత్రి జమ్మూకశ్మీర్‌లో పర్యటించడం ఇదే తొలిసారి.

అంతకుముందు ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది కూడా జమ్మూకశ్మీర్‌లోనే పర్యటించారు. ఆయన నేడు చినార్‌కోర్‌లోని డాగర్స్ డివిజన్‌లోని అన్ని ర్యాంకుల అధికారులతో సమావేశమయ్యారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సరిహద్దుల వద్ద నిర్భయంగా, అప్రమత్తంగా ఉన్నారని అభినందించారు.

**వాటి రక్షణపై అనుమానాలు ఉన్నాయి**
**అంతర్జాతీయ అణు ఇంధన ఏజెన్సీస్వాధీనం చేసుకోవాలి**
**పాక్ కుట్రలను తిప్పికొట్టిన భారత దళాలకు సెల్యూట్**
**కాశ్మీర్ పర్యటనలో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్**

ఉత్తేజిత దినపత్రిక

# వేతనాల పెంపుపై ఇన్ఫోసిస్ కీలక ప్రకటన..




దేశంలోని రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్.. కీలక ప్రకటన చేసినట్లుగా తెలుస్తోంది. ఎప్పటినుంచో ఉద్యోగులకు వేతనాల పెంపు వాయిదా వేస్తూ వస్తున్న ఈ కంపెనీ ఇప్పుడు ఫిబ్రవరి నెలాఖర్లోగా ఇంక్రిమెంట్ లెటర్స్ అందించనున్నట్లు తెలిసింది. దీని గురించి ఈ వ్యవహారం గురించి తెలిసిన వ్యక్తులు వెల్లడించినట్లు పలు మీడియాల్లో వార్తలు వస్తున్నాయి.

ఐటీ ఉద్యోగులకు గత కొంత కాలంగా గడ్డు పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా ఆయా ఐటీ కంపెనీల్లో ఉద్యోగుల సంఖ్య తగ్గుతూ వస్తుండటం ఒక కారణం కాగా.. ఖర్చుల్ని తగ్గించుకోవడంలో భాగంగా ఆయా కంపెనీలు ఉద్యోగుల్ని తొలగిస్తూ కూడా వస్తున్నాయి. ఆర్థిక మందగమనం నేపథ్యంలో.. ఈ రంగానికి డిమాండ్ తగ్గిపోయినట్లుగా తెలుస్తోంది. ముఖ్యంగా అంతర్జాతీయ ప్రముఖ టెక్ కంపెనీలు పెద్ద మొత్తంలో ఉద్యోగుల్ని తొలగించడం.. ఆ తర్వాత ఇదే ఎఫెక్ట్ దేశీయ ఐటీ కంపెనీలపైనా పడటం తెలిసిందే. దీంతో.. ఇక్కడ కూడా ఉద్యోగులకు వేతనాలు పెంచకపోవడం.. ఇతర ప్రోత్సాహకాలు తగ్గించడం.. కొత్తగా ఉద్యోగుల్ని నియమించుకోకపోవడం వంటివి జరిగాయి. అయితే ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి.

ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రముఖ ఐటీ కంపెనీలు కీలక ప్రకటనలు చేశాయి. చాలా వరకు వేతనాల పెంపును ప్రకటించాయి. ఈ ఆర్థిక సంవత్సరం అక్టోబర్- డిసెంబర్ త్రైమాసికంలో మంచి ఫలితాల్ని నమోదు చేయడం ఇందుకు ఒక కారణం. ఇన్ఫోసిస్ కూడా ఫలితాల సందర్భంగా.. దీనిపై ప్రకటన చేయగా.. ఇప్పుడు ఎప్పుడు వేతనాల పెంపు అమల్లోకి వస్తుందో తెలియజేసినట్లు సమాచారం.

ఫిబ్రవరి నెల ఆఖర్లోనే ఇన్ఫోసిస్.. తమ ఉద్యోగులకు వేతనాల పెంపునకు సంబంధించి ఇంక్రిమెంట్ లెటర్స్ అందించనుందంట. అయితే.. సగటున ఉద్యోగులకు 5 నుంచి 8 శాతం వరకు వేతనాల పెంపు ఉంటుందని.. ఇన్ఫోసిస్ వేతనాల పెంపు వ్యవహారం గురించి తెలిసిన కొందరు వ్యక్తులు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వేతనాల పెంపు ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడిప్పుడే ఐటీకి మళ్లీ డిమాండ్ పెరుగుతుండటం సహా వచ్చే ఆర్థిక సంవత్సరంలో తమ బడ్జెట్ అంచనాలు పెరుగుతాయని టెక్ కంపెనీలు అంచనా వేస్తున్నాయి. మన ఐటీ కంపెనీలకు ఆదాయం ఎక్కువగా నార్త్ అమెరికా నుంచే వస్తుందన్న సంగతి తెలిసిందే. మరోవైపు బ్యాచ్‌ల వారీగా ఇన్ఫోసిస్.. ప్రమోషన్ లెటర్స్ ఇప్పటికే ఇస్తోందని సమాచారం. డిసెంబర్ నెలలోనే తొలి బ్యాచ్‌కు ఇచ్చిందని.. ఇప్పుడు ఫిబ్రవరిలో రెండో దశ ప్రమోషనల్ లెటర్స్ ఇస్తుందని తెలుస్తోంది.

# ఉద్యోగులకు దిగ్గజ టెక్ కంపెనీ షాక్..

దిగ్గజ టెక్ సంస్థ మెటా ప్లాట్ ఫామ్స్ మరోసారి షాకింగ్ నిర్ణయం తీసుకుంది. భారీగా ఉద్యోగుల తొలగింపులకు సిద్ధమైంది. ఈసారి ఏకంగా 4 వేల మందికి పింక్ స్లిప్స్ ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 10నే ఉద్యోగులకు మెమోలు అందించనుందని పలు మీడియా నివేదికుల చెబుతున్నాయి. ఆ వివరాలు తెలుసుకుందాం.

ప్రపంచ స్థాయి టెక్ దిగ్గజం, ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా ప్లాట్ ఫామ్స్ తమ ఉద్యోగులకు షాకిచ్చింది. మరోసారి భారీగా తొలగింపులకు సిద్ధమైంది. ఈసారి సంస్థలోని మొత్తం ఉద్యోగుల్లో 5 శాతం మేర తొలగిస్తున్నట్లు తెలుస్తోంది. అంటే దాదాపు 4000 మందిపై ప్రభావం పడనుందని అంతర్జాతీయ మీడియాలు పేర్కొంటున్నాయి. ఫిబ్రవరి 10వ తేదీనే లేఆఫ్స్‌కి సంబంధించిన మెమోలు ఉద్యోగులు అందించనున్నారని సమాచారం. ఇందుకు సంబంధించిన ఓ మెమో లీకైనట్లు బిజినెస్ ఇన్‌సైడర్ న్యూస్ సంస్థ ఓ కథనం ప్రచురించింది. కంపనీలో పని తీరు సరిగా లేని ఉద్యోగులను తొలగిస్తున్నట్లు మెటా వర్గాలు తెలిపినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ ఏడాది మెటో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోసం భారీగా పెట్టుబడి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే ఒక్కసారిగా భారీ లేఆఫ్స్‌కి తెరతీసినట్లు టెక్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ నిర్ణయంతో కంపెనీలోని 5 శాతం మంది ఉద్యోగులపై ప్రభావం పడనుంది. ఈ విషయంపై గత నెలలో సిబ్బందితో మాట్లాడిన కంపెనీ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ క్లారిటీ ఇచ్చారు. సరైన పని తీరు లేని వారిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.



ఆసియా, ఆఫ్రికా, యూరప్ సహా అంతర్జాతీయంగా మొత్తం 12 దేశాల్లో ఈ లేఆఫ్స్ ఉంటాయని కంపెనీ వర్గాలు తెలిపాయి. అయితే, ఉద్యోగాలు కోల్పోయిన వారికి సంస్థ నుంచి అందాల్సిన ఆర్థిక, వృత్తి పరమైన సహాయం అందుతుందని మార్క్ జుకర్‌బర్గ్ తెలిపారు. ఈసారి 3000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నారని తొలుత వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ఆ సంఖ్య 4 వేలకు చేరినట్లు తెలుస్తోంది. భారీగా లేఆఫ్స్ చేపట్టడం టెక్ ఉద్యోగుల్లో మళ్లీ ఆందోళనలు పెంచుతోంది.

కోవిడ్-19 మహమ్మారి విజృంభణ తర్వాత టెక్, ఐటీ ఇండస్ట్రీలో భారీగా లేఆఫ్స్ జరిగిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది నుంచి కాస్త కోలుకున్నప్పటికీ ఉద్యోగుల్లో మాత్రం ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే దిగ్గజ టెక్ సంస్థలైన మైక్రోసాఫ్ట్, అమెజాన్, సేల్స్ ఫోర్స్ వంటి ఇతర సంస్థలు వేలాది మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. దీంతో మరోసారి టెక్ ఉద్యోగుల భవిష్యత్తు అయోమయంలో పడిపోయిందని చెప్పవచ్చు. చాలా సంస్థలు ఉద్యోగుల పనితీరుపై ఫోకస్ పెట్టాయి. సరిగా లేని ఉద్యోగులను ఇళ్లకు పంపించేస్తున్నాయి.

# మ్యూచువల్ ఫండ్ కీలక నిర్ణయం..




దేశీయ దిగ్గజ అసెట్ మెనేజ్మెంట్ కంపెనీల్లో ఒకటైన టాటా మ్యూచువల్ ఫండ్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ ఏఎంసీకి చెందిన రెండు పాపులర్ ఈక్విటీ ఫండ్ పథకాలను విలీనం చేస్తేందుకు ఆమోదం తెలిపింది. టాటా క్వాంట్ ఫండ్ టాటా ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ స్కీమ్స్ విలీనం కానున్నాయి. క్వాంట్ ఫండ్‌ను ట్రాన్స్‌ఫర్ స్కీమ్‌గా వ్యవహరిస్తారు. ఇక ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌ను సర్వైవింగ్ స్కీమ్‌గా వ్యవహరిస్తారు. అంటే ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌గా అందుబాటులో ఉండనుందని అర్థమవుతోంది. ఈ రెండు ఫండ్స్ విలీనం చేసేందుకు రికార్డ్ తేదీని మార్చి 21, 2025గా టాటా మ్యూచువల్ ఫండ్స్ నిర్ణయించింది. ఈ మేరకు తమ యూనిట్ హోల్డర్లకు నోటీసుల ద్వారా సమాచారం అందించింది.

సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (మ్యూచువల్ ఫండ్స్) రెగ్యులేషన్స్ 1996లోని రెగ్యులేషన్ 18ప్రకారం ఈ విలీనం ఉండనుందని టాటా మ్యూచువల్ ఫండ్ తెలిపింది. 30 రోజుల్లోగా ఈ విలీనం అమలులోకి రానుంది. మెర్జర్ స్కీమ్ కి చెందిన యూనిట్ హోల్డర్లకు ఎలాంటి ఎగ్జిట్ లోడ్ ఉండదు. అంటే టాటా క్వాంట్ ఫండ్ యూనిట్ హోల్డర్లు ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌లోకి మారతారని, ఈ మార్పు సమయంలో ఎలాంటి ఛార్జీలు ఉండవని నోటీసులో పేర్కొంది. ఈ క్రమంలో ఫిబ్రవరి 13, 2025 నుంచి టాటా క్వాంట్ ఫండ్ యూనిట్ల విక్రయాలను నిలిపివేస్తున్నట్లు తెలిపింది.

విలీనం అయ్యే స్కీమ్ టాటా క్వాంట్ ఫండ్ యూనిట్ హోల్డర్లకు రాతపూర్వక సమాచారాన్ని అందిస్తున్నట్లు టాటా మ్యూచువల్ ఫండ్ తెలిపింది. కొత్త స్కీమ్ టాటా ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ ఎన్ని యూనిట్లు వస్తాయి, పన్ను సమస్యలు ఏముంటాయి, ఆర్థిక సమాచారం వంటి వివరాలు అందిస్తున్నట్లు పేర్కొంది. రికార్డ్ తేదీ మార్చి 21 నుంచి టాటా క్వాంట్ ఫండ్ యూనిట్ హోల్డర్లు టాటా ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ యూనిట్ హోల్డర్లుగా మారనున్నారు.

మరోవైపు.. ప్రస్తుత నియంత్రణ అవసరాల పరంగా టాటా క్వాంట్ ఫండ్లలోని యూనిట్ హోల్డర్లు విలీనానికి అనుకూలంగా లేకుంటే ఎటువంటి నిష్క్రమణ లోడ్ లేకుండా ప్రస్తుత నికర ఆస్తి విలువ వద్ద యూనిట్లు విక్రయించేందుకు ఒక ఆప్షన్ ఇస్తారు. విలీనానికి అంగీకరించని యూనిట్ హోల్డర్లు ఫిబ్రవరి 19, 2025 నుంచి మార్చి 20, 2025 వరకు ఎగ్జిట్ ఆఫర్ ఉంటుంది. మార్చి 20, 2025 నాటికి ఎలాంటి రిడంప్షన్ లేదా స్విచ్ రిక్వెస్ట్ రాకుంటే ఆటోమేటిక్‌గా టాటా క్వాంట్ ఫండ్ యూనిట్లు టాటా ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌గా మారతాయి.

# 7 రోజుల్లో 40 శాతం జంప్!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం సెషన్లో ఆరంభంలో భారీగా పడిపోగా.. ఆఖర్లో తేరుకున్నాయి. అయినప్పటికీ నష్టాల్లోనే ముగిశాయి. గత 5 సెషన్లు మాత్రం స్టాక్ మార్కెట్లు కుప్పకూలిపోయిన సంగతి తెలిసిందే. మార్కెట్లు భారీగా పడిపోయినప్పటికీ ఒక స్టాక్ మాత్రం 7 సెషన్లుగా అప్పర్ సర్క్యూట్ కొడుతూనే ఉంది. దీని గురించి చూద్దాం.

స్టాక్ మార్కెట్లు గత కొద్ది రోజులుగా తీవ్ర ఒడుదొడుకుల్లో లోనవుతున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న కఠిన నిర్ణయాలు.. మార్కెట్లో అనిశ్చితికి కారణమవుతోంది.

ట్రంప్ వరుసగా దిగుమతి సుంకాలు విధిస్తుండగా.. భారత స్టాక్ మార్కెట్లపైనా ఈ ప్రభావం కనిపిస్తోంది. ఇవాల్టితో (బుధవారం) మినహాయిస్తే గత 5 సెషన్లలో చూసినట్లయితే సెన్సెక్స్ ఏకంగా 2 వేల పాయింట్లకుపైగా పడిపోయింది. నిఫ్టీ కూడా భారీగానే పతనమైంది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ. 17 లక్షల కోట్లకుపైగా తగ్గింది. అయితే బుధవారం సెషన్లో మాత్రం కాస్త ఊరట దక్కింది.

ఫిబ్రవరి 12న కూడా ఆరంభంలో స్టాక్ మార్కెట్లు భారీగా పడిపోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 900 పాయింట్లకుపైగా పడిపోగా.. ఇంట్రాడేలో తేరుకుంది.




మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో లాభాల్లోకి వచ్చిన సూచీలు ఆఖర్లో మాత్రం స్వల్ప నష్టాలతో ముగించాయి. సెన్సెక్స్ చివరకు 120 పాయింట్లకుపైగా పడిపోయి 761,71 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 26 పాయింట్లు తగ్గి 23,045 వద్ద స్థిరపడింది.

అయితే గత కొన్ని రోజులుగా మార్కెట్లు ఇలా నష్టపోతున్నప్పటికీ.. ఒక స్టాక్ గురించి మనం ప్రధానంగా మాట్లాడుకోవాలి. మార్కెట్ లాభనష్టాలతో సంబంధం లేకుండా ఇది వరుసగా అప్పర్ సర్క్యూట్స్ కొడుతూనే ఉండటం విశేషం. అదే శ్రీ అధికారి బ్రదర్స్ టెలివిజన్ నెట్‌వర్క్ లిమిటెడ్. బుధవారం సెషన్లో ఈ స్టాక్ 5 శాతం అప్పర్ సర్క్యూట్ కొట్టి రూ. 522.10 వద్ద స్థిరపడింది. ఈ క్రమంలోనే వరుసగా వారం రోజులుగా ఈ స్టాక్ అప్పర్ సర్క్యూట్లోనే ఉండటం విశేషం.

చివరగా ఫిబ్రవరి 3న ఈ స్టాక్ ధర రూ. 371.15 వద్ద ఉండగా.. ఫిబ్రవరి 4, 5, 6, 7, 10, 11, 12 ఇలా వరుసగా ఏడో సెషన్లో కూడా 5 శాతం అప్పర్ సర్క్యూట్ కొట్టింది. దీంతో ఇన్వెస్టర్లు పండగ చేసుకున్నారని చెప్పొచ్చు. ఇక కంపెనీ మార్కెట్ విలువ రూ. 1.32 వేల కోట్లుగా ఉంది. స్టాక్ 52 వారాల గరిష్ట విలువ రూ. 2219.95 కాగా.. కనిష్ట ధర రూ. 41.25 గా ఉంది.

గత 5 రోజుల్లో 21 శాతానికిపైగా పెరిగింది. నెలలో మాత్రం 40 శాతానికిపైగా నష్టాల్ని అందించింది. ఏడాది వ్యవధిలో చూస్తే 1100 శాతానికిపైగా రిటర్న్స్ అందించింది. ఐదేళ్లలో చూస్తే 38 వేల శాతానికిపైగా పెరగడం మరో విశేషం.

అయితే మార్కెట్లలో ఇన్వెస్ట్ చేసే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం మర్చిపోవద్దు. అప్పుడు మాత్రమే ఎక్కువగా రిస్క్ లేకుండా రిటర్న్స్ అందుకోవచ్చు.

# అమెరికన్లలో తీవ్ర భయాందోళనలు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో ఎలాన్ మస్క్ చాలా కీలక వ్యక్తిగా మారారు. ఇప్పటికే ఆయనకు డోజ్ బాధ్యతలు అప్పగించిన ట్రంప్.. తాజాగా మరిన్ని అధికారాలను కట్టబెట్టారు. దీంతో ఎలాన్ మస్క్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో అని అమెరికన్లలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. అమెరికా ప్రభుత్వ ఉద్యోగాల్లో కోతలు విధించి.. అనవసర ఖర్చును నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడంలో భాగంగా ట్రంప్, మస్క్ అనేక సంచలన నిర్ణయాలకు తెరతీస్తున్నారు.

రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్.. తన 2.0 పాలనలో సంచలన నిర్ణయాలు ఉంటాయని మొదటి నుంచీ చెబుతూనే ఉన్నారు. వృథా ఖర్చులు తగ్గించి.. ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గిస్తానని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి నియామకాలు, తొలగింపులు చూసుకునేందుకు.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ-డోజ్‌ను ట్రంప్ ఏర్పాటు చేశారు. ఈ డోజ్ బాధ్యతలను ప్రపంచ అపర కుబేరుడు.. టెస్లా, స్పేస్ ఎక్స్, ట్విటర్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే చర్యలు చేపట్టిన డోజ్.. అధికంగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగించింది. మరోవైపు.. తాజాగా ఎలాన్ మస్క్‌కు మరిన్ని అధికారులు ట్రంప్ కట్టబెట్టడంతో అమెరికాలో భారీగా ఉద్యోగాల కోతలు ఉంటాయని అమెరికన్ల భయపడిపోతున్నారు.

తాజాగా ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డోజ్‌కు మరిన్ని అధికారాలు కల్పించే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. అయితే ట్రంప్ సంతకం చేసే సమయంలో ఓవల్ ఆఫీస్‌లో ఎలాన్ మస్క్ తన నాలుగేళ్ల కుమారుడు %శ్ధ ాా-శఱఱ% తో కలిసి ఉండడం గమనార్హం. ఈ నిర్ణయంతో అమెరికాలో భారీగా ప్రభుత్వ ఉద్యోగాల కోతలు ఉండనున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. ఇక నుంచి అమెరికా ఫెడరల్ ఏజెన్సీలు.. డోజ్‌ను సంప్రదించిన తర్వాతే ఉద్యోగులను నియమించుకోవడం, తొలగించడం చేయాలని తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల్లో ట్రంప్ వెల్లడించారు. ప్రతీ ఫెడరల్ ఏజెన్సీ తక్కువ ఉద్యోగులతో పనిచేయాలని.. అవసరమైన మేరకు మాత్రమే కొత్త ఉద్యోగులను తీసుకోవాలని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా డోజ్ పనితీరును డొనాల్డ్ ట్రంప్ ప్రశంసలు గుప్పించారు. ఇక డోజ్ తీసుకుంటున్న నిర్ణయాలపై దావాలు నమోదు అవుతున్నా.. వాటిని పట్టించుకోకుండా ముందుకు సాగాలని మస్క్‌కు సూచించారు. అమెరికా ప్రభుత్వంలో భారీ సంస్కరణలు తీసుకువచ్చేందుకే రిపబ్లికన్ పార్టీని అమెరికన్లు



ఓటు వేసి గెలిపించారని ఎలాన్ మస్క్ తెలిపారు. అందుకే ఈ నిర్ణయాలు తీసుకుంటున్నామని.. ప్రజాస్వామ్యం అంటే ఇదే అని పేర్కొన్నారు. పారదర్శకంగా పనిచేసేందుకు డోజ్ ఎల్లపుప్డు ప్రయత్నిస్తుందని వివరించారు. వృథా ఖర్చులు, అనవసర ఉద్యోగులను తగ్గించకపోతే అమెరికా దివాలా తీస్తుందని ఎలాన్ మస్క్ వెల్లడించారు.

# 7 వేలకు పైగా కోళ్లను చంపిన మహారాష్ట్ర సర్కారు!

రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్రను బర్డ్ ఫ్లూ కుదిపేస్తోంది. ఇప్పటికే బర్డ్ ఫ్లూ కారణంగా అనేక కోళ్లు, పక్షులు, జంతువులు మృత్యువాత పడగా.. తాజాగా మహారాష్ట్ర సర్కారే కోళ్లను చంపేస్తోంది. అలాగే బర్డ్ ఫ్లూ ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చే గుడ్లను సైతం నాశనం చేస్తోంది. బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సర్కారు చెబుతుండగా.. ప్రజలంతా తీవ్రంగా భయపడిపోతున్నారు.

మహారాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరి ఒకటవ తేదీ నుంచి బర్డ్ ఫ్లూ ప్రభావిత ప్రాంతమైన 7 ప్రాంతాలను గుర్తించింది. ఈక్రమంలోనే అక్కడ ఉన్న 7,200 కోళ్లను చంపేసింది. అలాగే 2 వేల 230 గుడ్లను నాశనం చేసింది. చంద్రపూర్ జిల్లాలోని మంగ్లీ గ్రామంలో తాజాగా బర్డ్ ఫ్లూ వ్యాప్తిని చెందింది. ఈక్రమంలోనే అక్కడి నుంచి 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న అన్ని గ్రామాల్లో ఇప్పటికే 2,065 కోళ్లు చనిపోయాయి.

అయితే విషయం గుర్తించిన రాష్ట్ర పశు సంవర్ధక శాఖ అధికారులు ప్రభావిత ప్రాంతం నుంచి 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న అన్ని కోళ్లు, గుడ్లు, పశుగ్రాసాన్ని నాశనం చేయాలని నిర్ణయించింది. ఈక్రమంలోనే చంద్రాపూర్ జిల్లాలో 1,165 గుడ్లతో పాటు 50 కిలోల దాణాను నాశనం చేయించింది. అలాగే కోళ్ల పెంపకం దారులకు నష్ట పరిహారంగా రూ. 2,91,963 అందించారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు మహారాష్ట్రలోని లాతూర్, నాందేడ్, నాగ్‌పూర్, థానే, రాయ్‌గఢ్, చంద్రాపూర్ జిల్లాల నుంచి ఇప్పటి వరకు మొత్తంగా 7 బర్డ్ ఫ్లూ ప్రభావిత కేంద్రాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా లాతూర్ జిల్లాలోని ఉద్గిర్ తాలూకాలో 71 కాకులు చనిపోయాయి. ఈక్రమంలోనే వీటికి పరీక్షలు చేయగా.. బర్డ్ ఫ్లూ కారణంగానే ఇవి ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు. కేవలం కాకులు, కోళ్లలోనే కాకుండా పులులు, చిరుతలు, రాబందుల్లోనూ బర్డ్ ఫ్లూ నిర్ధారణ అయినట్లు వివరించారు. అలాగే నాగ్‌పూర్‌లోని గోరేవాడ రెస్క్యూ సెంటర్‌లో ఉంచిన 3 పులులు, ఒక చిరుత పులి సహా 693 జంతువులు, పక్షులు బర్డ్ ఫ్లూ కారణంగా చనిపోయిట్లు తెలిపారు. ముఖ్యంగా ఇందులో మూడు తెల్లటి వీపు గల రాబందులు కూడా ఉన్నట్లు చెప్పారు. పశుసంవర్ధక శాఖ అధికారులు మాట్లాడుతూ.. వ్యవస్థీకృత పౌల్ట్రీ సంస్థల నుంచి ఇప్పటి వరకు ఒక్క కేసు కూడా నివేదించబడలేదని తెలిపారు. కోళ్ల ఫాంల యజమానులు బయో భద్రతా చర్యలు చేపట్టారని.. ముఖ్యంగా కోళ్లు వలస పక్షులతో సంబంధంలోకి రాకుండా చూసుకుంటున్నాయని చెప్పుకొచ్చారు. వీటి వల్లే బర్డ్ ఫ్లూ వ్యాప్తిని నివారించవచ్చని స్పష్టం చేశారు.

# ప్రపంచంలోనే అవినీతి దేశంగా దక్షిణ సూడాన్

ప్రపంచంలోనే అత్యంత అవినీతి కలిగిన దేశంగా ఈ ఏడాది దక్షిణ సూడాన్ చెత్త రికార్డు సృష్టించింది. ఇక అవినీతి అతి తక్కువ ఉన్న దేశంగా డెన్మార్క్ తొలి స్థానంలో నిలిచింది. ఈ అవినీతి దేశాల జాబితాలో భారత్ 96వ స్థానంతో సరిపెట్టుకుంది. అది గత ఏడాదితో పోల్చితే 3 స్థానాలు పడిపోయింది. మొత్తం ప్రపంచంలోనే 180 దేశాలతో జాబితా రూపొందించింది. అయితే గత 3 ఏళ్లుగా వరుసగా భారత్ స్థానం పడిపోతుండటం గమనార్హం.



2024 ఏడాదికి సంబంధించి ప్రపంచంలోనే అత్యంత అవినీతి ఉన్న దేశాల జాబితా తాజాగా విడుదలైంది. గతేడాదికి సంబంధించి కరప్షన్ పెర్సెప్షన్స్ ఇండెక్స్‌ను ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ అనే సంస్థ విడుదల చేసింది. మొత్తం 180 దేశాలకు సంబంధించిన అవినీతి సూచీని విడుదల చేసింది. ఈ జాబితాలో భారత్ స్థానం మరోసారి పడిపోయింది. 2023 ఏడాదిలో 93వ స్థానంలో ఉన్న భారత్.. 2024కు వచ్చే సరికి మూడు స్థానాలు పడిపోయి.. 96వ స్థానంలో నిలిచింది. ప్రతీ సంవత్సరం నిపుణులు, వ్యాపారవేత్తల దృష్టిలో ఆయా దేశాల్లో అవినీతి ఎలా ఉంది అనే అంచనాలతో ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ వెల్లడించింది. టాప్-5లో డెన్మార్క్, ఫిన్లాండ్, సింగపూర్, న్యూజిలాండ్, లక్సంబర్గ్ నిలిచాయి.

ఆయా దేశాల్లో ఉండే అవినీతిని బట్టి ఈ సూచీలో 0 నుంచి 100 వరకు స్కోర్‌ను కేటాయించారు. సున్నా స్కోర్ ఉంటే అత్యంత అవినీతి దేశంగా.. 100 స్కోర్ సాధిస్తే అసలు అవినీతి లేని దేశంగా పరిగణిస్తారు. ఈ లిస్ట్‌లో మొట్టమొదటి స్థానంలో డెన్మార్క్ నిలిచింది. 100 స్కోరుకు గానూ డెన్మార్క్ 90 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. డెన్మార్క్ తర్వాత 88 పాయింట్లతో ఫిన్లాండ్ రెండో స్థానంలో ఉంది. మరోవైపు.. 84 పాయింట్లతో సింగపూర్ మూడో స్థానంలో.. 83 పాయింట్లతో న్యూజిలాండ్ నాలుగో స్థానంలో.. 81 పాయింట్లతో లక్సంబర్గ్ ఐదో స్థానంలో నిలిచాయి.

ఇక అవినీతి దేశాల జాబితాలో భారత్ 96వ స్థానంలో ఉన్నట్లు ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ వెల్లడించింది. 100 పాయింట్లకు గానూ భారత్ కేవలం 38 స్కోరు సాధించినట్లు పేర్కొంది. అయితే అంతకుముందు ఏడాది 2023లో 39 పాయింట్లతో భారత్ 93వ స్థానంలో ఉండగా.. 2024 ఏడాదిలో మాత్రం మూడు స్థానాలు పడిపోయి 96వ స్థానంలో నిలిచింది. అంతకుముందు 2022లో 40 పాయింట్లతో 85వ స్థానంలో భారత్ నిలిచింది. ఇక ఈ జాబితాలో చైనా 76వ స్థానంలో ఉంది. భారత్‌కు పొరుగున ఉన్న దేశాలైన పాకిస్తాన్ 27 పాయింట్లతో 135వ ర్యాంకులో ఉంది. 32 పాయింట్లతో శ్రీలంక 121వ ర్యాంకు.. బంగ్లాదేశ్ 149వ ర్యాంకులో ఉన్నాయి. తాలిబన్‌లు పాలిస్తున్న ఆఫ్ఘనిస్థాన్ కేవలం 17 పాయింట్లతో 165వ స్థానంలో ఉంది. ఇక ఈ అవినీతి దేశాల జాబితాలో అత్యంత అవినీతిమయమైన దేశంగా దక్షిణ సుడాన్ నిలిచింది. కేవలం 8 పాయింట్లతో ఈ లిస్ట్‌లో అట్టడుగున 180వ స్థానంలో నిలిచింది. కింది నుంచి రెండో స్థానంలో 9 పాయింట్లతో 179వ స్థానం.. 10 పాయింట్లతో వెనుజులా 178వ స్థానం.. 12 పాయింట్లతో సిరియా 177వ స్థానం.. లిబియా 13, ఈక్వటోరియల్ గునియా 13, నికరాగ్వా 15తో అత్యంత అవినీతిమయమైన దేశాలుగా నిలిచాయి.

# ఉచితాలతో ప్రజలను సోమరులుగా మారుస్తున్నారు..

ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు ఇచ్చే ఉచిత వాగ్దానాలపై సర్వోన్నత న్యాయస్థానం మరోసారి తీవ్రంగా స్పందించింది. ఈ హామీలను తప్పుపట్టిన సుప్రీంకోర్టు... ఉచిత ప్రకటనలు సరికాదని హితవు పలికింది. ఆ విధానాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని.. ఇది ప్రజలను సోమరులుగా మారుస్తుందని వ్యాఖ్యానించింది. ఉచిత రేషన్, డబ్బు అందడం వల్ల ఎవరూ పనిచేయడానికి కూడా ఇష్టపడటం లేదని, ఇలాంటివి మానుకోవడం ఉత్తమమని అభిప్రాయపడింది. గతంలోనూ సుప్రీంకోర్టు ఇలాంటి వ్యాఖ్యలు చేసింది.

ఉచితాలపై సర్వోన్నత న్యాయస్థానం మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ప్రకటించిన ఉచితాలను తప్పుబట్టింది. ఉచితంగా రేషన్, నగదు అందుతుండటంతో ప్రజలు పనిచేయడానికి ఇష్టపడటం లేదని వ్యాఖ్యానించింది. ఉచితాలతో పని చేయకుండా ఆహారం, డబ్బు సంపాదిస్తున్నారని పేర్కొంది. ఎన్నికల్లో ఉచిత పథకాలను ప్రకటించే విధానం మంచిది కాదని అభిప్రాయపడింది. ఉచిత పథకాలతో లబ్దిదారులను పరాన్నజీవులుగా మారుస్తున్నామని జస్టిస్ బిఆర్ గవాయ్ మండిపడ్డారు. పట్టణ ప్రాంతాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలన్న పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ మేరకు స్పందించింది. ఈ అంశంపై విచారణను ఆరు వారాల పాటు వాయిదా వేసింది.

జనవరిలోనూ సుప్రీంకోర్టు ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. ఎన్నికలు రాగానే లాడ్లీ బెహెన్‌తో పాటు పలు పథకాలను ప్రకటించి.. సొమ్ములను పంచిపెడతారని మండిపడింది. ఢిల్లీలో ఇప్పుడు ఓ పార్టీ రూ. 2,500 ఇస్తామంటే.. ఇంకో పార్టీ తాము దీనికి రెట్టింపు ఇస్తామని హామీ ఇస్తుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉచితాలకు డబ్బులు ఉంటాయని, కోర్టుల్లో పనిచేసే ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి మాత్రం ఉండవని తూర్పారబట్టింది. గతంలో సీనియర్ న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సమయంలో ఉచితాలు అంటే ఏమిటి? అని సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. దీనిని తాము అడ్డుకోలేమని తేల్చిచెప్పింది. అంతేకాదు, సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ, తాగునీరు వంటివి సౌకర్యాలు ఉచితాలుగా పరిగణించవచ్చా? ప్రజల హక్కా..? అని ప్రశ్నించింది

అయితే, ఉచితాలపై అసహనం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు.. 2013లో సుబ్రమణ్యం బాలాజీ కేసులో మాత్రం భిన్నమైన వ్యాఖ్యలు చేసింది. 'అర్హులైన వ్యక్తులకు కలర్ టీవీలు, ల్యాప్‌టాప్‌లు మొదలైన వాటి రూపంలో పెద్ద మొత్తంలో పంపిణీ చేయడం అనేది నేరుగా రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు సంబంధించింది.. ఇందులో జోక్యం చేసుకోలేము' అని కోర్టు స్పష్టం చేసింది. కాగా, ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలూ పోటాపోటీగా ఉచితాలను ప్రకటించాయి. దీనిని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచిత తాయిలాలు.. నగదు ఆధారిత పథకాలపై అత్యవసర విచారణ చేపట్టాలని కోరారు. దీనిని పరిశీలించిన హైకోర్టు. అత్యవసరంగా విచారించేందుకు నిరాకరించింది

ఉత్తేజిత దినపత్రిక



# ఇలా వండి తింటే బరువు పెరగరు..







అన్నం వండడం.. ఇది వండడానికి కూడా ఓ పద్ధతి ఉంటుందా అంటే ఉందంటున్నారు నిపుణులు. అదేంటో తెలుసుకోండి.

అన్నం ఇలా వండి తింటే బరువు పెరగరు.. మరెన్నో లాభాలు..

బియ్యంలో చాలా రకాలు ఉంటాయి. ఒక్కో రకానికి ఒక్కో ప్రత్యేక రుచితో పాటు పోషక విలువలు ఉంటాయి. ఈ అన్నం తింటే ఎన్నో హెల్త్ బెనిఫిట్స్ ఉంటాయి. అయితే, ఇవి మనం ఎలా వండాం.. ఎలా తిన్నామనేదానిపై కూడా ఆధారపడి ఉంటుంది. కాబట్టి, అన్నం సరిగ్గా ఎలా వండాలో కూడా తెలుసుకోండి..

అన్నం.. కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు అన్నం తినకూడదని అనుకుంటారు. కానీ, ఆయుర్వేద డాక్టర్ చైతాలీ రాథోడ్ ఇదే విషయంలో బరువు తగ్గడం, షుగర్, థైరాయిడ్, పిసిఓడి వంటి సమస్యలు ఉన్నప్పటికీ అన్నం తినొొచ్చని చెబుతున్నారు. అందుకోసం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

బియ్యంలోని పోషకాలు.. అన్నం సరిగ్గా వండి తింటే బియ్యం గరిష్ఠ ప్రయోజనాలు పొందొొచ్చు. అది ఎలా వండాలో సరైన పద్ధతి, అన్నం తినడం వల్ల కలిగే లాభాలు తెలుసుకోవాలి. బియ్యం కార్బోహైడ్రేట్స్‌కి మంచి మూలం. ఇవి శరీరానిక శక్తిని అందిస్తాయి. గ్లూటెన్ రహితమైనది, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, బి విటమిన్స్ వంటి అనేక ముఖ్య పోషకాలను కలిగి ఉంటుంది. అంతేకాకుండా తక్కువ సోడియం కంటెంట్ ఉంటుంది. బియ్యం ఫైబర్‌కి మూలం. జీర్ణక్రియకి హెల్ప్ అవుతుంది. రక్తంలో చక్కెరని కంట్రోల్ చేస్తుంది.

ఎలా వండాలి.. బియ్యాన్ని వండే ముందు వాటిని డ్రై రోస్ట్ చేయాలి. ఇలా రైస్‌ని స్టోర్ చేసి స్టోర్ కూడా చేస్తుంది. దీని వల్ల రుచి పెరగడమే కాకుండా స్టార్చ్ కూడా తగ్గుతుంది. అన్నం మొత్తగా కాకుండా పొడిపొడిగా వస్తుంది.

ఉడికించడం.. వేయించిన బియ్యాన్ని 1 కప్పు రైస్‌కి 4 కప్పుల నీరు పోసి 1 టేబుల్ స్పూన్ ఆవు నెయ్యి కొద్దిగా ఉప్పు వేసి ఉడికించండి. అన్నం ఉడికిన తర్వాత ఎక్కువగా ఉన్న నీటిని తీసేయాలి. వీటిని మీరు గంజిలా తాగడం, లేదా సూప్స్‌లా చేసుకోవచ్చు. అన్నాన్ని పప్పులు, కూరగాయలతో ఎంజాయ్ చేయొచ్చు.

ఇవి మరువొద్దు.. ఇలా అన్నం వండి తింటే బరువు పెరగరు. ఎలాంటి సమస్యలు రావు. అయితే, ఒక్కటి గుర్తుపెట్టుకోండి. తక్కువగా తిన్నప్పుడు మాత్రమే ఈ లాభాలు. ఎక్కువగా తింటే ఎలాంటి లాభాలు ఉండవు. ఆవు నెయ్యి కలపడం వల్ల పోషకాలు పెరుగుతాయి. కాబట్టి అస్సలు మరవకండి.

# మచ్చలు, పిగ్మెంటేషన్







ముఖంపై మచ్చలు ఉంటే చూడ్డానికి బాగోదు. అలాంటి సమస్యల్ని దూరం చేయాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అవేంటో తెలుసుకోండి.

ఎర్రకందిపప్పుని ఇలా ప్యాక్ వేస్తే ముఖంపై మచ్చలు, పిగ్మంటేషన్ మాయం..

పిగ్మంటేషన్.. దీని కారణంగా ముఖంపై మచ్చలు ఏర్పడతాయి. ఈ సమస్య రావడానికి చాలానే కారణాలు ఉన్నాయి. ఎండలో ఎక్కువగా ఉండడం వల్ల కూడా ట్యాన్ ఎక్కువగా ఏర్పడి పిగ్మంటేషన్ ఏర్పడుతుంది. ఈ సమస్య దూరమవ్వడానికి చాలా ఇంటి చిట్కాలు ఉన్నాయి. అందులో భాగంగా ఎర్ర కందిపప్పుని వాడడం వల్ల మచ్చలు, ట్యాన్ దూరమవుతుంది.

ఎర్రకందిపప్పు.. చర్మ ఆరోగ్యాన్ని కాపాడడంలో ఎర్ర కందిపప్పు బాగా హెల్ప్ చేస్తుంది. ఇందులో సహజ బ్లీచింగ్ ఏజెంట్స్‌ని కలిగి ఉంటుంది. దీనిని రాయడం వల్ల ముఖంపై నల్ల మచ్చలు దూరమవుతాయి. అంతేకాకుండా మంచి రంగు కూడా వస్తుంది. దీనిని రాస్తే డార్క్ స్పాట్స్, పిగ్మంటేషన్ దూరమై స్కిన్ మెరుస్తుంది.

పాలు.. చర్మ ఆరోగ్యాన్ని కాపాడడంలో పాలు కూడా మేలు చేస్తాయి. ఇవి మంచి క్లెన్సర్ అని చెప్పొచ్చు. ఇందులో మాయిశ్చరైజింగ్ గుణాలు ఉన్నాయి. వీటి వల్ల చర్మ రంగు మెరుగ్గా ఉంటుంది. లాక్టిక్ ఆమ్లం ఈ ప్రయోజనాన్ని అందిస్తుంది. పాలు చర్మాన్ని మెరిసేలా చేస్తుంది.

ఏం చేయాలంటే..

ఈ రెండింటిని కలిపి ప్యాక్‌లా చేయాలంటే ముందుగా కొద్దిగా ఎర్ర కందిపప్పు తీసుకుని పాలలో నానబెట్టాలి. ఓ రెండు గంటల తర్వాత గ్రైండ్ చేయాలి. ఇది ప్యాక్‌లా తయారవుతుంది. దీనిని ముఖానికి అప్లై చేస్తే నల్ల మచ్చలు తగ్గి స్కిన్ ట్యాన్ మెరుగ్గా ఉంటుంది.

పెరుగు.. కొంత మందికి పాలు చర్మానికి సెట్ అవ్వవు. అలాంటివారు పెరుగు, మజ్జిగని కూడా వాడొొచ్చు. పెరుగులోనూ బ్లీచింగ్ గుణాలు ఉన్నాయి. ఇవి కూడా చర్మ రంగు మెరుగ్గా చేసి నల్ల మచ్చలు, ట్యాన్‌ని దూరం చేస్తాయి. పెరుగులోని లాక్టిక్ యాసిడ్ ట్యాన్‌ని దూరం చేస్తుంది.

# పెదవులు పగిలాయా..

శీతాకాలంలో ఎంత కేర్ తీసుకున్నా పెదవులు పగులుతూ ఉంటాయి. వాతావరణం చల్లగా ఉండటం, చలిగాలుల కారణంగా పెదవులు పొడిబారి..







పగులుతుంటాయి. విటమిన్ లోపం, శరీరంలోని తేమ శాతం తగ్గడం, పొగతాగడం, అలాగే పెదవులను తరచూ నాలుకతో తడి చేసుకుంటూ ఉండటం వల్ల కూడా పెదాలు పగులుతాయి. పగిలిన పెదవులు తిరిగి మృదువుగా మారాలంటే.. కొన్ని ఇంటి చిట్కాలు సహాయపడతాయి.

కలబంద రాయండి.. పగిలిన పెదవులు తిరిగి మృదువుగా మారడానికి కలబంద ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. మీ పెదవులు పగిలితే.. కలబంద గుజ్జును పెదవులకు అప్లై చేయండి. దీనిలోని పాలీశీకరైడ్లు.. గాయాన్ని నయం చేస్తాయి. కలబంద గుజ్జును పెదాలకు అప్లై చేసి అరగంట పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాతా.. నీటితో శుభ్రం చేసుకోండి. ఇలా రోజూ చేస్తే.. పెదవులు మృదువుగా మారతాయి.

వెన్నతో.. పెదాల పగుళ్లకు వెన్నను మించిన పరిష్కారం లేదు. సమస్య తగ్గడంతో పాటు...అధరాలు లేత గులాబీ రంగులో మెరిసిపోతాయి. చెంచా వెన్నకు చిటికెడు పంచదార యాడ్ చేసి సున్నితంగా స్క్రబ్ చేయాలి. ఇలా కాసేపు చేస్తే... రక్తప్రసరణ సక్రమంగా జరిగి పెదాలు కాంతిమంతంగా కనిపిస్తాయి. పగుళ్లు తగ్గేవరకు.. ఇలా వెన్న అప్లై చేస్తూ ఉండండి.

తేనె.. మీ పెదవులు పగిలితే.. తేనె మంచి మెడిసిన్‌లా పనిచేస్తుంది. రెండు చుక్కల తేనె తీసుకొని పెదాలపై మృదువుగా మర్దనా చేయాలి. ఇందులోని యాంటీమైక్రోబియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు పగుళ్లు, ఇన్‌ఫెక్షన్లు రాకుండా చేస్తాయి.

కొబ్బరి నూనె..

దీన్ని రోజూ పెదాలకు రాస్తూ ఉంటే మాయిశ్చరైజర్‌లా పనిచేస్తుంది. ఇందులో యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. ఇది ఇన్‌ఫెక్షన్‌లను నివారించి, పగుళ్ల నుంచి రక్షిస్తుంది.

నువ్వులు నూనె.. నువ్వుల నూనెను కాస్త వేళ్లకు అద్దుకుని పెదాలకు రాసి, మృదువుగా మర్దన చేయండి. కాస్త జిడ్డుగా అనిపించినా కాసేపటికి పెదాలకు తగిన తేమ అంది.. సమస్య దూరమవుతుంది.

# కడుపునొప్పితో బాధపడుతున్నారా..







పిల్లలకి కడుపు నొప్పి సాధారణం. అలాంటప్పుడు కంగారు పడక కొన్ని ఇంటి చిట్కాలు పాటిస్తే సమస్య తగ్గుతుంది. అవేంటో తెలుసుకోండి.

పిల్లలకి ఏదైనా సమస్యలు వస్తే తట్టుకోలేరు. అదే సమస్యని బయటికి చెప్పుకోలేరు. పిల్లలకి ఎక్కువగా కడుపు నొప్పి వస్తుంది. దీనికి చాలా కారణాలు ఉంటాయి. అజీర్ణం వంటి సమస్యల కారణంగా కడుపు నొప్పి, జీర్ణ సమస్యలు వస్తాయి.

వాము.. కడుపునొప్పిని తగ్గించడంలో వాము కూడా చాలా మంచిది. టీ స్పూన్‌లో సగం పరిమాణంలో వాము తీసుకుని గ్లాసు నీటిలో మరిగించి తాగించండి. లేదా పొడి చేసి అంతే పరిమాణంలో మజ్జిగలో కలిపి ఇవ్వాలి.

అల్లం.. కడుపునొప్పిని దూరం చేయడంలో అల్లం బాగా పనిచేస్తుంది. చాలా మంది నిమ్మరసంతో అల్లాన్ని కలిపి తాగుతారు. అయితే, పిల్లలకి నిమ్మరసం అంత మంచిది కాదు. కాబట్టి, అల్లాన్ని మెత్తగా పేస్టు చేసి దానిని ఉండలుగా చేసి మింగేలా చూడండి. లేదా రసాన్ని తీసి కొంచెం తేనెతో కలిపి పిల్లలకి ఇవ్వొచ్చు. దీనివల్ల కడుపు నొప్పి తగ్గుతుంది. అల్లం తీసుకునేటప్పుడు అతిగా ఇవ్వకూడదు. గుండెల్లో మంట వస్తుంది.

జాజికాయ.. జాజికాయలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ముఖ్యంగా జీర్న సమస్యల్ని దూరం చేయడంలో జాజికాయ హెల్ప్ చేస్తుంది. జాజికాయని వేయించి మెత్తగా పొడిచేసి కొద్ది పరిమాణంలో పిల్లలకి తేనెతో కలిపి ఇస్తే జీర్ణ సమస్యలు దూరమవుతాయి. ఇలా చేస్తే పిల్లలకి విరోచనాలు, త్రేన్పులు, కడుపులో సమస్యలు దూరమవుతాయి. తేనెలో నానబెట్టిన జాజికాయ గుజ్జుని పిల్లలకి పట్టొొచ్చు. తేనె వద్దనుకుంటే గోరువెచ్చని నీటిలో కలిపి ఇవ్వొచ్చు.

ఇంగువ.. ఇంగువ కూడా జీర్ణ సమస్యల్ని దూరం చేయడంలో హెల్ప్ చేస్తుంది. కాబట్టి, కడుపు నొప్పి ఉంటే ఈ పొడిని వేడి నీటిలో కలిపి పిల్లల బొడ్డు చుట్టూ రాయాలి. ఇలా చేస్తే కడుపు నొప్పి తగ్గుతుంది.

ఇవి కూడా.. కొన్ని సార్లు ఆహారం పడకపోయినా కూడా జీర్ణ సమస్యలు వస్తాయి. అందుకే, త్వరగా జీర్ణమయ్యే ఆహారాన్ని పిల్లలకి ఇవ్వాలి. పండ్లు, కూరగాయలు ఇవ్వాలి. అదే విధంగా, నీరు త్రాగడం, సరైన ఆహారం ఇవ్వాలి. ఇవి చేసినా కడుపునొప్పి తగ్గకపోతే వెంటనే డాక్టర్స్‌ని కలవాలి.

# దానిమ్మ తింటే ఈ సమస్యలు దూరం..





చూడగానే ఎర్రగా నోరూరించే పండు దానిమ్మ. ఈ పండుని తినడానికి చాలా మంది ఇష్టపడతారు. పెరుగన్నం, సలాడ్స్, జ్యూస్ వరకూ వీటిని ఎన్నో రకాలుగా తీసుకోవచ్చు. వీటిని తీసుకోవడం వల్ల చాలా లాభాలు ఉన్నాయి. అవేంటో తెలుసుకోండి.

దానిమ్మలోని పోషకాలు.. కేలరీలు 234, ప్రోటీన్ 4.7గ్రా, కొవ్వు 3.3 గ్రా, కార్బోహైడ్రేట్స్ 52 గ్రా, ఫైబర్ 11.3 గ్రా, వీటితో పాటు విటమిన్ సి, ఫొలేట్, మెగ్నీషియం, పొటాషియంలు ఉన్నాయి. ఇవన్నీ ఆరోగ్యానికి చాలా మంచిది. తక్కువ కేలరీలు, కొవ్వు ఎక్కువగా ఉంటాయి. ఇందులో పీచు, విటమిన్స్, మినరల్స్ ఎక్కువగా ఉంటాయి. దానిమ్మ పండ్లని ఎక్కువగా తీసుకుంటే ఈ పోషకాలన్నీ అందుతాయి.

క్యాన్సర్‌ని తగ్గించే గుణాలు ఈ పండులో క్యాన్సర్‌ని నిరోధించే లక్షణాలు ఉన్నాయి. దానిమ్మ రసం తీసుకుంటే ప్రొస్టేట్ క్యాన్సర్ తగ్గుతుందని చెబుతున్నారు నిపుణులు.

గుండె సమస్యలు దూరం.. ఈ పండు తింటే గుండె జబ్బులు, టైప్ 2 డయాబెటిస్, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక శారీరక సమస్యల్ని దూరం చేస్తాయి. దానిమ్మలో దీర్ఘకాలిక సమస్యలు దూరమవుతాయి.ఈ పండు తింటే బాడీలో మంట తగ్గుతుంది. దానిమ్మలో పాలీఫెనోలిక్ గుణాలు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. దానిమ్మ పండు మూత్రపిండాల పనితీరుని మెరుగ్గా చేస్తుంది. ఇది కిడ్నీల్లో రాళ్ళ సమస్యని తగ్గిస్తుంది. కిడ్నీలో రాళ్ళ సమస్యని దూరం చేయడంలో ఈ పండు చాలా బాగా పనిచేస్తుంది. దానిమ్మ రసం రక్తంలో ఆక్సలేట్స్, కాల్షియం సాంద్రతని తగ్గిస్తుంది. ఇవి ఎక్కువగా ఉంటే కిడ్నీల్లో రాళ్ళు ఏర్పడతాయి. దానిమ్మలో ఎల్లాజిటానిన్స్ అనే యాక్సిడెంట్స్ శరీరంలోని వాపుని తగ్గిస్తాయి. ఇవి బ్రెయిన్ హెల్త్‌కి చాలా మంచిది. దీంతో అల్జీమర్స్, పార్కిన్సన్స్ సమస్యలు దూరమవుతాయి. దానిమ్మ తింట జీర్ణ సమస్యలు దూరమవుతాయి. ఇందులో ప్రీబయోటిక్ అనే బ్యాక్టీరియా ఉంటుంది. అదే విధంగా ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల జీర్ణ సమస్యలు దూరమవుతాయి. ఈ పండుని అలానే తినడం చాలా మంచిది. అప్పుడే అందులోని ఫైబర్ అందుతుంది. జ్యూస్ చేస్తే అందులో షుగర్ వేయకుండా ఇవ్వాలి. హైబీపి ఉన్నవారు మెడిసిన్ తీసుకునేవారు డాక్టర్ సలహాతోనే మెడిసిన్ తీసుకోవడం చాలా ముఖ్యం.

# ఎలాంటి బిందీ మంచిదంటే..



బొట్టు.. ఇంతకుముందు కాలంలో అయితే కుంకుమ పెట్టుకునే వారు. కాలం మారేకొద్దీ ఇది ఫుల్ ట్రెండీగా మారిపోయింది. ఇందులోనే ముఖాకృతిని బట్టి ఎలాంటి స్టిక్కర్స్ ఎంచుకోవాలో ఇలా తెలుసుకోండి. వీటి వల్ల మీ ఫేస్ షేప్‌ని బట్టి చక్కని బిందీని ఎంచుకోవచ్చు.

బొట్టు.. ముఖానికి అందాన్నివ్వడంలో ఈ బొట్టు కీ రోల్ పోషిస్తుంది. నేడు మార్కెట్‌లో ఎన్నో రకాల, రంగుల ఆకారాల బిందీలు దొరుకుతున్నాయి. వీటన్నింటిని మీరు కూడా స్టైల్ చేయాలనుకుంటున్నారా. ఇక్కడ కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. మీ ఫేస్ షేప్‌ని బట్టి చక్కని బిందీని ఎంచుకోవాలి. అప్పుడే మంచి లుక్ వస్తుంది.



రౌండ్ ఫేస్ కోసం.. మీ ఫేస్ షేప్ గుండ్రంగా ఉంది. కానీ, మీరు అలాంటి గుండ్రంగా ఉండేవాటిని ఎంచుకోవద్దు. మీరు చక్కగా పొడుగ్గా ఉండే కొన్ని బిందీలు ఎంచుకోవచ్చు. దీని వల్ల మీ లుక్ ఎలివేట్ అవుతుంది. చూడ్డానికి నీట్‌గా కనిపిస్తుంది. ఈ ఫేస్ షేప్ ఉన్నవారి నుదురు, గడ్డం చదునుగా ఉంటుంది. కాబట్టి, వీరు కూడా గుండ్రంగా ఉండే వాటిని ఎంచుకుంటే నుదురు మరీ పెద్దగా అనిపిస్తుంది. కాబట్టి, చిన్న గుండ్రంగా ఉండే బిందీలు పెట్టుకోవాలి.

డైమండ్ షేప్.. వీరికి నుదురు చిన్నగా ఉంటుంది. గడ్డం, ముఖాకృతి చక్కగా ఉంటుంది. వీరు మరీ ఎక్కువగా డిజైన్స్ ఉండేవాటి కాకుండా సింపుల్‌గా ఉండే బిందీలు పెట్టుకోవడం మంచిది.. ఓవల్ షేప్ ఉన్నవారికి నుదురు, గడ్డం ఉండేవారికి పొడుగ్గా ఉండే బిందీల కంటే గుండ్రంగా ఉండే ఎలాంటి బిందీలైనా ఎంచుకోవచ్చు. వీరికి ఇవి సరిగ్గా సరిపోతాయి.

చతురస్రాకారంగా.. చతురస్రాకారం ఫేస్ షేప్ ఉన్నవారు కూడా అన్ని డిజైన్స్ కాకుండా మంచి హైలైట్‌గా ఉండే గుండ్రని, చంద్రుని ఆకారంలో ఉన్న బిందీలు పెట్టుకోవచ్చు. దీని వల్ల మీ ముఖం చూడ్డానికి చక్కగా కనిపిస్తుంది.

కొన్ని గుర్తుంచుకోవాలి.. అయితే, మ్యాచింగ్ బిందీ పెట్టుకోవడం అనేది ఇంతకు ముందు ఫ్యాషన్. ఇప్పుడు కాంట్రాస్ట్ కూడా పెట్టుకోవచ్చు. మీరు వేసుకునే డ్రెస్‌లో ఏదైనా చిన్న మ్యాచింగ్ ఉన్న కలర్ బిందీ పెట్టుకోండి. దీంతో మీ బిందీ ఎలివేట్ అవుతుంది. కాబట్టి, ఇలాంటి కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అదే విధంగా మీరు ఎప్పుడు ఒకేలా కాకుండా కొన్ని ట్రై చేస్తుండాలి. దీంతో మీకే అర్థమవుతుంది. మీకు ఎలాంటి డిజైన్స్ నచ్చుతాయో. అదే విధంగా బిందీలను కొనేటప్పుడు మంచి బ్రాండ్‌వి కొనాలి. దీంతో ఎక్కువసేపు అవి ఉంటాయి. కొన్ని బిందీలు త్వరగా ఊడిపోతుంటాయి. అలా కాకుండా ఉండాలంటే పౌడర్ రాయాలి. టాల్కమ్ పౌడర్, కాంపాక్ట్ పౌడర్ వంటివి రాయాలి. ఆ తర్వాత బిందీ పెట్టాలి. అప్పుడు ఆ బిందీ ఎక్కువసేపు ఉంటుంది.

# మొటిమల మచ్చలు తగ్గట్లేదా..


చాలా మందికి మొటిమలు వస్తాయి. అవి వచ్చి తగ్గాక మచ్చలు పడుతుంటాయి. ఇవి అంత త్వరగా తగ్గవు. వీటిని తగ్గించే కొన్ని టిప్స్ గురించి తెలుసుకోండి. చర్మంలో సెబమ్ ఎక్కువగా రావడం వల్ల ముఖంపై మొటిమలు వస్తాయి. ఇవి వచ్చి తగ్గాక మచ్చలు మాత్రం ఓ పట్టాన పోవు. ఇవి నల్లగా మారి హైపర్ పిగ్మంటేషన్‌గా మారతాయి. వీటిని తగ్గించేందుకు కొన్ని టిప్స్ హెల్ప్ చేస్తాయి. అవేంటో తెలుసుకోండి.

దోసరసం.. కీరదోసలో విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉన్నాయి. చర్మాన్ని మృదువుగా చేసి పిగ్మంటేషన్‌ని తగ్గిస్తుంది. ఇందుకోసం దోస రసాన్ని దూది సాయంతో మొటిమలు, మచ్చలపై రాస్తే మొటిమలు, మచ్చలు తగ్గుతాయి.

కొబ్బరి నూనె.. కొబ్బరి నూనె చర్మానికి సహజమైన మాయిశ్చరైజర్‌లా పనిచేస్తుంది. ఇది సమస్యల్ని తగ్గిస్తుంది. మచ్చలు పోయేలా చేస్తుంది. ఇందుకోసం మచ్చలపై కొబ్బరి నూనె రాసి రాత్రంతా అలానే ఉంచి ఉదయాన్నే క్లీన్ చేయాలి.

పసుపు.. పసుపులో కూడా యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉన్నాయి. ఈ పసుపుని చర్మంపై అప్లై చేస్తే మొటిమలు, మచ్చలు తగ్గుతాయి.

తేనె.. ఇది చర్మంపై నేచురల్ మాయిశ్చరైజింగ్ లక్షణాలను కలిగి ఉంటుంది. దీనిని చర్మంపై అప్లై చేస్తే మొటిమల మచ్చలు తగ్గిపోతాయి. క్లీన్ చేసిన ముఖాన్ని తుడిచి మచ్చలపై తేనె రాయాలి. ఇలా రెగ్యులర్‌గా చేస్తే మచ్చల్ని తగ్గించుకోవచ్చు.

నిమ్మరసం.. నిమ్మరసంలో సహజ బ్లీచింగ్ గుణాలు ఉన్నాయి. కాబట్టి, ఇది మొండి మచ్చల్ని తగ్గిస్తుంది. సగం చెక్క నుంచి తీసిన నిమ్మరసాన్ని తీసి ఏదైనా ప్యాక్‌లా కలిపి అప్లై చేయాలి. 10 నుంచి 15 నిమిషాల పాటు చల్లని నీటితో క్లీన్ చేయాలి.

అలోవెరా జెల్... అలోవెరా జెల్ ఎన్నో వైద్య లక్షణాలను కలిగి ఉంది. ఇవి చర్మ మంటను తగ్గిస్తాయి. మొటిమలు, మచ్చల్ని తగ్గిస్తాయి. అలోవెరా జెల్ మొటిమలపై రాసి అరగంట ఉంచి చల్లని నీటితో క్లీన్ చేయాలి. ఇలా రెగ్యులర్‌గా చేస్తే మొటిమల మచ్చలు తగ్గుతాయి.



# తిరుపతి నుంచే మొదలు..!

ఆంధ్రప్రదేశ్: సాంకేతికత వినియోగానికి పెద్దపీట వేస్తున్న ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని పశువులకు గోధార్‌తో అనుసంధానం చేసే ఆలోచన చేస్తోంది. ప్రజలకు ఆధార్ కార్డు తరహాలో పశువులకు గోధార్ తేవాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు పశుసంవర్ధక శాఖ అధికారులకు సూచించారు. పైలెట్ ప్రాజెక్టుగా తిరుపతి జిల్లాలో ఈ కార్యక్రమం చేపట్టాలని సూచించారు. బుధవారం విజయవాడలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరిగిన కాంక్లేవ్‌కు చంద్రబాబు హాజరు అయ్యారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాలనలో సాంకేతికత వినియోగానికి పెద్దపీట వేస్తోంది. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ విషయాన్ని పదే పదే అధికారులకు సూచిస్తున్నారు. పౌర సేవల దగ్గర నుంచి, ప్రజా సమస్యల పరిష్కారం వరకూ ప్రతి అంశానికి సాంకేతికతను జోడించి వేగంగా చర్యలు తీసుకునేలా పనిచేయాలని చంద్రబాబు అధికారులకు ఆదేశిస్తూ ఉంటారు. మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ పేరిట.. పౌర సేవలను మొబైల్ ఫోన్ ద్వారా అందిస్తున్న ఏపీ ప్రభుత్వం.. ఇప్పుడు మరో సరికొత్త ప్రయోగానికి సిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖలో కీలక మార్పులకు ప్రణాళికలు రచిస్తోంది. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో విజయవాడలో టెక్ ఏఐ కాంక్లేవ్ నిర్వహించారు. ఈ కాంక్లేవ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగానే ఏపీ పశుసంవర్ధక శాఖ అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు కీలక సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రజలకు ఆధార్ కార్డు అందిస్తున్న తరహాలోనే పశువులను కూడా గోధార్‌తో అనుసంధానం చేసే ఆలోచన చేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా నుంచి మొదలుపెట్టాలని సూచించారు. ఈ నేపథ్యంలో త్వరలోనే పశువులను గోధార్‌తో అనుసంధానం చేసే ఆలోచనను ఏపీ ప్రభుత్వం చేస్తోంది. మరోవైపు మన దేశంలో ప్రతి పౌరుడికి కేంద్ర ప్రభుత్వం ఆధార్ కార్డు అందిస్తున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వ ప్రయోజనాలు అందుకునేందుకు ఆధార్ కార్డు తప్పనిసరి. ఇక ఆధార్ కార్డులాగే భూములకు భూధార్ కార్డులు మంజూరు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటికే ఈ పని మొదలుపెట్టారు. ఇప్పుడు పశువుల కోసం గోధార్ తేవాలని ఏపీ ప్రభుత్వం ఆలోచన చేయడం విశేషం. మరోవైపు ఏఐ కాంక్లేవ్‌లో మాట్లాడిన చంద్రబాబు.. ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యంతో పనులు చేసే పరిస్థితి ప్రస్తుతం ఉందన్నారు. గతంలో రాష్ట్రంలో గుంతలు పడిన రోడ్లు కనిపించేవని.. కానీ ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో ఆ రోడ్లను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలో జాతీయ రహదారులను కూడా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలోని రైతుల ఆదాయాలను రెట్టింపు చేసేందుకు ఏపీ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ప్రస్తుతం టెక్నాలజీ అందరికీ అందుబాటులోకి వచ్చిందన్న చంద్రబాబు.. అందరూ దీనిని ఉపయోగించుకోవాలని సూచించారు.

# మెట్రో రైలు ప్రాజెక్టులకు గుడ్‌న్యూస్..



ఆంధ్రప్రదేశ్: ఆంధ్రప్రదేశ్‌లో మెట్రో రైలు ప్రాజెక్టులకు సంబంధించి కీలక ముందడుగుపడింది. ఈ ప్రాజెక్టులకు రుణాలను సేకరించే పనిలో ఉంది.. ఈ మేరకు మెట్రో రైలు కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి పలు విదేశీ బ్యాంకు ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆ తర్వాత సమావేశంలో మెట్రో రైలు ప్రాజెక్టుల కోసం రుణం గురించి చర్చించారు. త్వరలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో విదేశీ బ్యాంకుల ప్రతినిధులు చర్చిస్తారని సమాచారం. తక్కువవడ్డీకే రుణం కోసం ఇచ్చే బ్యాంకు లతో సంప్రదింపులు చేశామని ఎండీ రామకృష్ణారెడ్డి తెలిపారు.

విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో మెట్రో రైలు ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. విశాఖపట్నంలో తొలి దశలో 46 కిలోమీటర్ల మేర మూడు కారిడార్లు నిర్మిస్తారు. విజయవాడలో రెండు దశల్లో మెట్రో రైలు ప్రాజెక్టును చేపట్టనున్నారు. మొదటి దశలో రెండు కారిడార్లు, రెండో దశలో మరో కారిడార్ నిర్మాణం చేస్తారు. ఈ ప్రాజెక్టుల డీపీఆర్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. విశాఖపట్నంలో మొదటి కారిడార్ విశాఖ స్టీల్ ప్లాంట్ నుండి కొమ్మాది వరకు 34 కిలోమీటర్లు ఉంటుంది. రెండవ కారిడార్ గురుద్వార నుంచి పాత పోస్టాఫీస్ వరకు 5 కిలోమీటర్లు ఉంటుంది. మూడవ కారిడార్ తాడిచెట్లపాలెం నుండి చినవాల్తేర్ వరకు 6 కిలోమీటర్లు ఉంటుంది. రెండో దశలో కొమ్మాది నుండి భోగాపురం వరకు 30 కిలోమీటర్ల మేర మరో కారిడార్ నిర్మిస్తారు.

విజయవాడలో మొదటి దశలో రెండు కారిడార్లు ఉంటాయి. కారిడార్ 1ఏ గన్నవరం నుంచి పండిట్ నెహ్రూ బస్టాండ్ వరకు ఉంటుంది. కారిడార్ 1బీ పండిట్ నెహ్రూ బస్టాండ్ నుండి పెనమలూరు వరకు ఉంటుంది. రెండో దశలో కారిడార్ 3 పండిట్ నెహ్రూ బస్టాండ్ నుండి అమరావతి వరకు నిర్మిస్తారు. మొదటి దశలో 38.4 కిలోమీటర్ల మేర కారిడార్లను నిర్మించాలని డీపీఆర్లో ప్రతిపాదించారు. రెండో దశలో 27.5 కిలోమీటర్ల మేర మూడో కారిడార్‌ను నిర్మించాలని నిర్ణయించారు. విశాఖపట్నం, విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టుల తొలిదశ డీపీఆర్‌కు ఇప్పటికే ఆమోదం తెలిపింది. ఈ విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టుల మొదటి దశకు సంబంధించిన పూర్తి వివరాల నివేదికకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. త్వరలోనే ఈ ప్రాజెక్టులు పట్టాలెక్కే అవకాశం ఉంది.. ప్రజలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుంది అంటున్నారు.

# వైఎస్ జగన్ ఇలాఖాలో వైసీపీకి షాక్...



ఆంధ్రప్రదేశ్: ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అవినీతి ఆరోపణలు వచ్చిన కడప మేయర్ సురేష్ బాబును ఆ పదవి నుంచి తొలగించింది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా కడప మేయర్ సురేష్ బాబు మీద అనర్హత వేటు వేస్తూ.. ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు కడప మేయర్ సురేష్ బాబు, కడప టీడీపీ ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డి మధ్య గత కొంతకాలంగా వాగ్వాదాలు జరుగుతున్న సంగతి తెలిసిందే.

ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరో బిగ్ షాక్ తగిలింది. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గం కడపలో వైసీపీకి గట్టి దెబ్బ తగిలింది. కడప మేయర్ సురేష్‌బాబుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనర్హత వేటు వేసింది. కడప మేయర్ పదవి నుంచి సురేష్ బాబును ఏపీ ప్రభుత్వం తొలగించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి తాజాగా ఆదేశాలు జారీ చేశారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగా కడప మేయర్ పదవి నుంచి సురేష్ బాబును తొలగిస్తున్నట్లు ఏపీ మున్సిపల్ శాఖ తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

కడప మేయర్‌గా పనిచేస్తూ సురేష్ బాబు.. కడపలోని అభివృద్ధి పనుల కాంట్రాక్టులను తన కుటుంబానికి చెందిన సంస్థకు అప్పగించారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించగా.. విజిలెన్స్ నివేదిక ఆధారంగా సురేష్ బాబును కడప మేయర్ పదవి నుంచి తొలగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ చట్టం నిబంధనలు అతిక్రమించిన నేపథ్యంలో కడప మేయర్ మీద అనర్హత వేటు వేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కడపలో మేయర్ వర్సెస్ కడప రెడ్డమ్మ.. మరోసారి కుర్చీ ఫైట్

మరోవైపు కడప అభివృద్ధి పనులను తన కుటుంబానికి చెందిన ఎంఎస్ వర్ధిని కన్‌స్ట్రక్షన్స్‌కు అప్పగించినట్లు సురేష్ బాబు మీద ఆరోపణలు వచ్చాయి. రూ. 36 లక్షల అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇక ఎంఎస్ వర్ధిని కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ డైరెక్టర్లుగా సురేష్ బాబు కుమారుడు అమరేష్, భార్య జయశ్రీ వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మేయర్ పదవిలో ఉంటూ తన కుటుంబసభ్యులకు కాంట్రాక్టు పనులు అప్పగించారంటూ సురేష్ బాబుపై ఆరోపణలు వచ్చాయి. దీనిపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించగా.. విజిలెన్స్ దర్యాప్తులో పలు ఆధారాలు సేకరించారు. ఇదే సమయంలో సురేష్ బాబును సైతం మంగళవారం మున్సిపల్ శాఖ అధికారులు విచారించారు. మంగళవారం మున్సిపల్‌శాఖ కార్యదర్శి ఎదుట సురేష్‌బాబు తన వివరణ తెలియజేశారు. అయితే బుధవారం విజిలెన్స్ కమిషనర్ నివేదిక ఆధారంగా ఏపీ పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి కడప మేయర్ మీద అనర్హత వేటు వేస్తూ నిర్ణయం తీసుకున్నారు.



మరోవైపు కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డితో విభేదాల కారణంగా కడప మేయర్ సురేష్ బాబు గత కొన్ని నెలలుగా వార్తల్లో నిలుస్తూ వచ్చారు. ఓ సారి కడప మేయర్ ఇంటి వద్ద చెత్త వేయటంతో సురేష్ బాబు అప్పట్లో వార్తల్లో నిలిచారు. కడప నగరపాలక సంస్థ సమావేశాలు జరిగే సందర్భంగా ఎమ్మెల్యే మాధవి రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు మధ్య వాగ్వాదం జరిగిన ఘటనలు కూడా ఉన్నాయి.

# టర్కీ నుంచి వీడియో విడుదల చేసిన కేఏ పాల్..



ఆంధ్రప్రదేశ్: ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఇండియా-పాకిస్థాన్ మధ్య శాంతి నెలకొల్పేందుకు టర్కీ వెళ్తానని చెప్పడమే కాక.. వెళ్లి చూపించారు. అక్కడ మహదీ ఛైర్మన్‌తో కలిసి పాకిస్థాన్‌కు టర్కీ క్షిపణులు అమ్మడం నిజమేనని, భారతీయులు టర్కీని బహిష్కరిస్తున్నారని తెలిపారు. ప్రపంచ దేశాలు ఆయుధాలు అమ్మకూడదని, యుద్ధాల వల్ల లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక అమెరికా తీరుపై కూడా తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఆ వివరాలు..

ఇండియా-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తొలగిస్తానంటూ.. యుద్ధం ఆపేస్తానంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్.. మీడియా ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. పైగా ఇరు దేశాల మధ్య శాంతి చర్చల కోసం పాకిస్థాన్ వెళ్లేందుకు కూడా సిద్ధమన్నారు పాల్. అంతటితో ఆగక.. ఆదివారం రోజు తన టీమ్‌తో కలిసి టర్కీకి శాంతి శిఖర సభలో పాల్గొనడానికి వెళుతున్నానంటూ ముంబై ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. సిబ్బంది ఆయన్ను అడ్డుకోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులకు, విమానాశ్రయ సిబ్బందికి ఫిర్యాదు కూడా చేశారు. ఆ సంగతి పక్కకు పెడితే.. టర్కీ వెళ్తానన్న కేఏ పాల్.. అన్నంత పని చేశారు. తాజాగా టర్కీ నుంచి వీడియో విడుదల చేశారు.

టర్కీ వెళ్లిన కేఏ పాల్.. అక్కడ ఓ వ్యక్తితో కలిసి వీడియోను రిలీజ్ చేశారు. అతడు మహదీ చైర్మెన్ అని తన పోస్టులో పేర్కొన్నారు. ఈ వీడియోలో కేఏ పాల్ మాట్లాడుతూ..పాకిస్థాన్‌కు టర్కీ మిస్సైల్స్ అమ్మింది నిజమే అన్నారు. భారతీయులంతా టర్కీని బహిష్కరిస్తున్నారని తెలిపాడు. అయితే అమెరికా పాకిస్థాన్‌కు మిస్సైల్స్ అమ్మలేదా అని కేఏ పాల్ ఈ సందర్భంగా ప్రశ్నించారు. ట్రంప్ మిస్సైల్స్ అమ్మడానికే సౌదీ అరేబియా వెళ్లాడని చెప్పుకొచ్చారు. ప్రపంచానికి ఆయుధాలు విక్రయించే అమెరికా.. పాకిస్థాన్-ఇండియా మధ్య శాంతి నెలకొల్పడం వరకు బాగానే ఉంది.. మరి మిగతా దేశాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.

కేఏ పాల్ మాట్లాడుతూ.. మిడిల్ ఈస్ట్‌లో జరిగిన యుద్ధాల వల్ల లక్షల మంది పౌరులు ప్రాణాలు కోల్పోయరన్నారు. మిలియన్ల డాలర్లు వృథాగా ఖర్చు చేశారని ఆరోపించారు. ఒకవేళ అణుయుద్ధం గనక వస్తే లక్షల కోట్ల మంది చనిపోతారన్నారు. అందుకే రష్యా ఉక్రెయిన్ యుద్ధం సమయంలో తాను అక్కడ ఉంటానని చెప్పానని తెలిపారు. అంతేకాక ఎక్కడ యుద్ధం జరిగితే తాను అక్కడ ఉంటానని కేఏ పాల్ చెప్పుకొచ్చారు. మిస్సైల్స్ ఆపడానికే తాను టర్కీ వెళ్లినట్టు కేఏ పాల్ చెప్పుకొచ్చారు. ప్రపంచ దేశాలు యుద్ధాలు ఆపాలని.. యుద్ధ సామాగ్రిని అమ్మకూడదన్నారు. కోట్ల మంది ప్రజలు తిండి లేక ఏడుస్తుంటే.. యుద్ధానికి ఇన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం ఎంత వరకు కరెక్ట్ అన్నారు. ఇప్పుడు కావాల్సింది యుద్ధాలు సృష్టించే వాళ్లు కారు.. యుద్ధాలు ఆపే నాయకత్వం కావాలన్నారు కేఏ పాల్.

కేఏ పాల్ తన టీమ్‌తో కలిసి టర్కీకి శాంతి శిఖర సభలో పాల్గొనడానికి వెళ్లే సమయంలో ముంబై ఎయిర్‌లైన్స్ సిబ్బంది వారిని ప్రయాణానికి అనుమతించకుండా అడ్డుకున్నారు. దీంతో కేఏ పాల్ వారితో గొడవపడిన సంగతి తెలిసిందే. తన దగ్గర పాస్‌పోర్ట్, వీసా, విమాన టికెట్లు ఉన్నాయని.. తన కుమారుడు జాన్ పాల్, జ్యోతి, మమతా రెడ్డితో కలిసి టర్కీలోని ఇస్తాంబుల్ వెళుతున్నట్లు చెప్పారు. గత వారం కూడా తాను టర్కీలో ఉన్నానని.. అలాంటప్పుడు తనను ఎందుకు ఆపుతున్నారని కేఏ పాల్ సిబ్బందిని ప్రశ్నించారు. తనను అడ్డుకునే హక్కు వారికి లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు.

## బెజవాడ దుర్గమ్మకు
# తెలంగాణ భక్తుడి అరుదైన కానుక..

విజయవాడ: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు అరుదైన కానుక అందింది. తెలంగాణకు చెందిన భక్తుడు బెజవాడ కనకదుర్గమ్మకు అరుదైన కానుక అందించారు. తెలంగాణలోని సిరిసిల్ల జిల్లాకు చెందిన నల్ల విజయ్ కుమార్.. అగ్గిపెట్టెలో పట్టేంత చీరను కనకదుర్గమ్మకు సమర్పించారు. ఐదున్నర మీటర్ల పొడవు, 40 ఇంచుల వెడల్పుతో.. వంద గ్రాముల బరువు ఉండే ఈ చీరను అగ్గిపెట్టెలో పట్టేలా రూపొందించారు. బుధవారం ఉదయం కనకదుర్గమ్మ ఆలయానికి కుటుంబసభ్యులతో కలిసి చేరుకున్న నల్ల విజయ్ కుమార్.. ఈ చీరను అమ్మవారికి సమర్పించారు. కనకదుర్గమ్మ ఆలయ అధికారుల సమక్షంలో ఈ కానుకను నల్ల విజయ్ కుమార్ అందజేశారు. సిరిసిల్లకు చెందిన చేనేత కళాకారుడు నల్ల విజయ్ కుమార్ అగ్గిపెట్టెలో పట్టే



చీరలను నేయడం ఇదే తొలిసారి కాదు. నల్ల విజయ్ కుమార్ తండ్రి.. నల్ల పరంధాములు కూడా చేనేత కళాకారులే. నల్ల పరంధాములు గతంలో అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీరను తయారు చేసి సిరిసిల్ల ఖ్యాతిని ప్రపంచానికి చాటారు. ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ విజయ్ కుమార్ కూడా అగ్గిపెట్టెలో పట్టే చీరలను తయారు చేస్తున్నారు. నల్ల విజయ్ కుమార్ ఇలా అగ్గిపెట్టెలో పట్టే చీరలను తయారు చేసి తిరుమల శ్రీవారికి, వేములవాడ రాజన్నకు అందించడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే అగ్గిపెట్టెలో పట్టేలా పట్టు శాలువాను కూడా తయారు చేసి కొండగట్టు అంజన్న స్వామికి సమర్పించారు. వెండి కొంగు చీర, బంగారు చీరలను కూడా గతంలో ఆయన తయారు చేశారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా నల్ల విజయ్ కుమార్ పురస్కారం కూడా అందుకున్నారు.

ఐదున్నర మీటర్ల పొడవు, 46 ఇంచుల వెడల్పుతో ఈ సుగంధ ద్రవ్యాలు వెదజల్లే చీరను నల్ల విజయ్ కుమార్ రూపొందించారు. ఈ చీర బరువు 400 గ్రాములు. నాలుగు రోజుల పాటు శ్రమించి, 12 వేల రూపాయలు ఖర్చు చేసి చీరను తయారు చేశారు. అలాగే ఒక వ్యాపారవేత్త కూతురి వివాహం కోసం బంగారు చీరను కూడా తయారు చేశారు. గతంలో మూడు కొంగుల చీర, ఉంగరంలో పట్టే చీర, దబ్బనంలో దూరే చీర, కుట్టు లేని లాల్చి, పైజామా, జాతీయ జెండాలను కూడా మగ్గంపై రూపొందించి నల్ల విజయ్ కుమార్ ప్రశంసలు అందుకున్నారు. తన చేనేత కళా నైపుణ్యంతో ఇలాంటి అద్భుతాలు సృష్టిస్తున్న నల్ల విజయ్ కుమార్.. సిరిసిల్ల చేనేత కార్మికుల ప్రతిభను ప్రపంచానికి తెలియజేస్తున్నారు.

# ఎమ్మెల్సీ పదవికి మహిళా నేత రాజీనామా..



ఆంధ్రప్రదేశ్: ఆంధ్రప్రదేశ్ శాసనమండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ జకియా ఖానమ్ ఎమ్మెల్సీ పదవికి, వైఎస్సార్సీపీకి రాజీనామా చేసి సంచలనం సృష్టించారు. టీడీపీ, జనసేనలలో చేరుతారని ఊహాగానాలు రాగా, ఆమె బీజేపీలో చేరారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో పురందేశ్వరి ఆమెను పార్టీలోకి ఆహ్వానించారు. ప్రధాని మోదీ ముస్లిం మహిళలకు భరోసా ఇచ్చారని, అందుకే బీజేపీలో చేరానని జకియా ఖానమ్ తెలిపారు. ఆమె రాకతో పార్టీకి మరింత బలం చేకూరుతుందని పురందేశ్వరి పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ శాసనమండడలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ జకియా ఖానమ్ ఎమ్మెల్సీ పదవికి, వైఎస్సార్సీపీకి రాజీనామా చేశారు. ఆమె టీడీపీ, జనసేన పార్టీల్లో చేరతారని ప్రచారం జరిగింది.. కానీ ఆమె మాత్రం ఊహించని ట్విస్ట్ ఇచ్చారు. కూటమిలో మరో పార్టీకి జై కొట్టారు. తన పదవికి రాజీనామా చేసిన వెంటనే నేరుగా విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయాని వెళ్లారు. అక్కడ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కాషాయ కండువా కప్పి ఆమెను పార్టీలోకి ఆహ్వానించారు. జకియా ఖానమ్ బీజేపీలో చేరడం పార్టీకి ఎంతో ఆనందంగా ఉందన్నారు పురందేశ్వరి. ప్రధాని మోదీ అందరికీ సమాన హక్కులు కల్పిస్తున్నారని, ముస్లిం మహిళలకు భరోసా ఇచ్చిన ఏకైక ప్రధాని ఆయనేనని జకియా ఖానమ్ అన్నారు. ముస్లిం మైనారిటీల నుంచి మంచి సందేశం ఇవ్వాలనే ఉద్దేశంతోనే తాను బీజేపీలో చేరినట్లు ఆమె తెలిపారు. మైనార్టీలకు బీజేపీలో మంచి స్థానం ఉంటుందని.. జకియా ఖానం కుటుంబం ఎన్నో సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్నారన్నారు. జకియా ఖానమ్‌ను బీజేపీలోకి మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నామని..కులమతాలకు అతీతంగా పేదలకు సంక్షేమ ఫలాలు అందించడమే బీజేపీ లక్ష్యమన్నారు.. ఆ దిశగానే బీజేపీ దేశానికి మంచి పాలన అందిస్తోందన్నారు. మైనార్టీలకు బీజేపీపై ఉన్న ప్రేమ, నమ్మకం దీనితో మరోసారి రుజువైందన్నారు పురందేశ్వరి. బీజేపీ నినాదం "సబ్ కే సాత్.. సబ్ కా వికాస్" అంటే అందరితో కలిసి, అందరి అభివృద్ధి కోసం పాటుపడటమ న్నారు. పార్టీలో కుల, మతాలకు తావు లేదని.. ఇది బీజేపీ ముఖ్య సిద్ధాంతమన్నారు. పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడితే భారత్ గట్టిగా బుద్ధి చెబుతుందన్నారు పురందేశ్వరి. ప్రధాని నరేంద్ర మోదీ గట్టి నిర్ణయాలు తీసుకుంటున్నారని.. 2014కు ముందు పరిస్థితులు వేరుగా ఉండేవని, కానీ ఆ తర్వాత పరిస్థితులు మారాయన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ తీసుకునే నిర్ణయాలతో ప్రత్యర్థులు భయపడుతున్నారన్నారు. భారత సైన్యం ఉగ్ర స్థావరాలను టార్గెట్ చేసి దాడులు చేయడం అద్భుతమని.. "మన యుద్ధం ఉగ్రవాదులపై" అనే సందేశాన్ని ప్రధాని ప్రపంచానికి తెలియజేశార న్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తోందని.. అందుకే యుద్ధం పాకిస్తాన్ పౌరుల మీద కాకుండా ఉగ్రవాదులపై జరిగిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ బలమైన, సత్తా ఉన్న నాయకుడని.. అటువంటి నాయకత్వాన్ని బీజేపీ ఈరోజు దేశానికి అందించిందన్నారు. బీజేపీలో చేరిన జకియా ఖానమ్‌ది అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం.. 2021లో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అయ్యారు. అయితే కొంతకాలంగా వైఎస్సార్సీపీకి దూరంగా ఉంటు న్నారు. ఈ క్రమంలో కొద్ది నెలల క్రితం మంత్రి లోకేష్‌ను కలిశారు.. అప్పుడే టీడీపీలోచేరతారని ప్రచారం జరిగింది. ఇంతలో తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనం సిఫార్సు లేఖ విషయంలో జకియా ఖానమ్‌పై ఆరోపణలు రాగా.. ఆ వెంటనే తిరుమల లో కేసు నమోదైంది. దీంతో ఆమె కొంతకాలంగా సైలెంట్‌గా ఉన్నారు.. ఇవాళ ఉన్నట్టుండి ఎమ్మెల్సీ పదవికి, వైఎస్సార్సీపీకి రాజీనామా చేశారు.. వెంటనే బీజేపీలో చేరిపోయారు.

# నా కళ్ళకు గంతలు కట్టి ఇంటికి తీసుకురమ్మన్నారంట..

ఆంధ్రప్రదేశ్: డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సంచలన ఆరోపణలు చేశారు. 2021లో తన అరెస్ట్‌ను గుర్తు చేసుకుంటూ, తన పుట్టినరోజునే టార్గెట్ చేశారని ఆరోపించారు. తనను ఉగ్రవాదిలా తీసుకెళ్లారని, కళ్లకు గంతలు కట్టి జగన్ ఇంటికి తీసుకుపోవాలని చూశారని సంచలన విషయాలు వెల్లడించారు. అంతేకాదు, మే 14ను ప్రతీకార దినోత్సవంగా ప్రకటించి, ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అసలేం జరిగిందో తెలుసుకోవాలంటే కథనం చూడాల్సిందే!

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సంచలన వ్యాఖ్యలు చేశారు. 2021 మే 14న జరిగిన తన అరెస్ట్ గురించి ప్రస్తావిస్తూ.. ఓ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను హైదరాబాద్‌లో అరెస్ట్ చేసి సీఐడీ కార్యాలయానికి తీసుకొచ్చే సమయంలో జరిగిన పరిణామాలను రఘురామ వివరించారు. ఆ సమయంలో ఏం జరిగిందో చెప్పారు. ఆ రోజు తన ఇంటికి సీఐడీ అధికారులు వచ్చి బలవంతంగా అరెస్ట్ చేసి తీసుకెళ్లినట్లు వివరించారు. హైదరాబాద్ నుంచి బయల్దేరిన తర్వాత జరిగిన పరిణామాలను రఘురామ వివరించారు.

'2021 మే 14న నా పుట్టిన రోజు.. నా పుట్టినరోజు లావిష్‌గా ఉంటాయని జగన్‌మోహన్ రెడ్డికి తెలుసు. నన్ను అరెస్ట్ చేసే పదిరోజుల ముందు కరోనా వచ్చింది.. బర్త్ డేకు రెండు రోజుల ముందు నెగిటివ్ వచ్చింది.. అప్పుడు బర్త్ డే పార్టీ చేసుకోవాలనుకున్నాను. అయితే నన్ను పుట్టిన రోజు నాడు అరెస్ట్ చేస్తేనే కిక్కు అని జగన్ భావించారు. నన్ను ఉగ్రవాదిని అరెస్ట్ చేసినట్లుగా తీసుకెళ్లారు.. విజయ్ పాల్ నా ఫోన్‌ను లాగేసుకున్నారు.. ఆ ఫోన్ తానే తీసుకెళ్లి ఆయనకు ఇచ్చినట్లుగా రిపోర్ట్ రాసుకొచ్చారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వారధి దగ్గరకు వెళ్లగానే ఐదు నిమిషాల పాటూ ఫోన్ మాట్లాడారు. జగన్‌మోహన్ రెడ్డి ఇంటికి తీసుకెళ్లాలా.. డైరెక్ట్‌గా సీఐడీ ఆఫీస్‌కు తీసుకెళ్లాలా అని సందిగ్ధంలో ఉన్నారు. ఆ తర్వాత సీఐడీ ఆఫీసుకు తీసుకెళ్లారు. నాకు తర్వాత తెలిసింది ఏంటంటే.. నా కళ్లకు గంతలు కట్టి జగన్‌మోహన్ రెడ్డి తన ఇంటికి తీసుకురమ్మన్నారని.. నా వెనుక సీఆర్‌పీఎఫ్ వాళ్లు ఉన్నారు.. వాళ్లు వెనక ఫాలో అయితే తెలిసిపోతుందని సీఐడీ ఆఫీస్‌కు తీసుకెళ్లారు' అంటూ వివరించారు. అక్కడ తనపై కస్టోడియల్ టార్చర్ జరిగిందని.. ఆ తర్వాత ఏం జరిగిందో ప్రజలందరికి తెలుసన్నారు.

అయితే రఘురామ తన పుట్టినరోజు (మే 14)ను ప్రతీకార దినోత్సవంగా నిర్వహించినట్లు ప్రకటించారు. 'గతేడాది మే 13న సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. చాలా చోట్ల 14వ తేదీ తెల్లవారుజాము వరకు ప్రజలు పోలింగ్ కేంద్రాల్లో ఓపిగ్గా నిరీక్షించి మరీ వైఎస్సార్సీపీకి ఓటుతో గుణపాఠం చెప్పారు. 2021లో తన పుట్టిన రోజైన మే 14న గత ప్రభుత్వం రాజ ద్రోహం కేసు పెట్టి తీసుకెళ్లి ఏం చేసిందో అందరికీ తెలుసు. అదే వారి పతనానికి బాటలు వేసింది. ఆ ఘటన తరువాతే రచ్చబండ కార్యక్రమంతో నాటి పాలకుల



వైఫల్యాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేశా. గత ప్రభుత్వంతో విసిగిపోయిన ప్రజలు కూడా సమయం వచ్చే వరకు ఎదురుచూసి.. గతేడాది ఇదే రోజు తెల్లారే వరకు తమ ప్రతీకారం తీర్చుకున్నారు. అందుకే ఈ రోజును ప్రతీకార దినోత్సవంగా నిర్వహిస్తున్నాం. కాళ్ల మండలం పెదఅమిరంలో నిర్వహించే ఈ వేడుకలో వీలైనంత వరకు ప్రజలంతా పాల్గొనాలని' కోరారు. ఈమేరకు ఉండిలో ప్రతికా దినోత్సవాన్ని నిర్వహించారు ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ.

# కాంట్రాక్ట్ లెక్చరర్స్ తొలగింపు..?

**తెలంగాణ:** విశ్వవిద్యాలయాలలో కాంట్రాక్ట్ లెక్చరర్ల కొనసాగింపుపై నిర్ణయం ఆయా విశ్వవిద్యాలయాలకే ప్రభుత్వం వదిలేసింది. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని విద్యాశాఖ పేర్కొంది. అయితే.. ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని లేదా కనీసం టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తుది నిర్ణయాన్ని విశ్వవిద్యాలయాలకు అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

కాంట్రాక్టు లెక్చరర్లను కొనసాగిస్తారా లేదా తొలగిస్తారా అనే అంశం ఇప్పుడు విశ్వవిద్యాలయాల పరిధిలోకి వెళ్లిపోయింది. ఈ విషయంలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని విద్యాశాఖ సూచించినట్లు సమాచారం. ఈసీ తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం ఆమోదం తెలుపుతుందని సంకేతాలు పంపినట్లు తెలుస్తోంది. అయితే.. ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని, లేదా కనీసం టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు




చేస్తుండటంతో.. ప్రభుత్వం ఈ అంశాన్ని విశ్వవిద్యాలయాలకు వదిలివేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

కాంట్రాక్టు లెక్చరర్లను కొనసాగించడం లేదా వారిని తొలగించి రెగ్యులర్ సిబ్బందిని నియమించడం అనేది పూర్తిగా ప్రభుత్వ విధాన నిర్ణయానికి సంబంధించిన విషయం. అయితే విద్యాశాఖ ఈ విషయంలో విశ్వవిద్యాలయాల నిర్ణయానికి వదిలివేయడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టు లెక్చరర్లు చాలా సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఇప్పుడు హఠాత్తుగా వారిని తొలగిస్తే ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు వచ్చే ప్రమాదం ఉంది. అందుకే ఈ విషయంపై విధానపరమైన నిర్ణయం ప్రభుత్వం తీసుకోవాల్సి ఉంటుంది. కానీ విద్యాశాఖ మాత్రం కాంట్రాక్టు లెక్చరర్ల అంశంపై ఈసీలో చర్చించి ప్రతిపాదనలు పంపాలని విశ్వవిద్యాలయాలకు సూచించింది. దీనివల్ల ప్రభుత్వానికి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే విశ్వవిద్యాలయాలు కాంట్రాక్టు లెక్చరర్లను కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నా.. సమస్య పరిష్కారం కాదని, ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని కాంట్రాక్టు లెక్చరర్లు చెబుతున్నారు.

విద్యాశాఖలో అవగాహన లేని కొందరు అధికారుల కారణంగా అనవసర సమస్యలు వస్తున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే ముందు.. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విశ్వవిద్యాలయాల్లో దాదాపు 1500 మంది కాంట్రాక్టు.. అవుట్ సోర్సింగ్ టీచింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. అయితే అధికారులు ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లకుండా.. ఖాళీలన్నింటినీ భర్తీ చేయవచ్చని వివరించినట్లు తెలుస్తోంది. దీనితో ఆయన వెంటనే ఖాళీల భర్తీకి ఆమోదం తెలిపారు. ఆ తరువాతే కాంట్రాక్టు లెక్చరర్లు తమను క్రమబద్ధీకరించాలని.. లేకపోతే టైమ్ స్కేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలకు దిగారు.

# స్విమ్స్‌లో మరింత ఉన్నతంగా వైద్య సేవలు - టిటిడి ఛైర్మెన్ శ్రీ బీ ఆర్ నాయుడు

**తిరుపతి**

తిరుపతి స్విమ్స్ లో మరింత ఉన్నతంగా వైద్యసేవలు అందిస్తామని టిటిడి ఛైర్మెన్ శ్రీ బీ ఆర్ నాయుడు తెలిపారు. టిటిడి ఛైర్మెన్ శ్రీ బీఆర్ నాయుడు అధ్యక్షతన స్విమ్స్ సమావేశ మందిరంలో బుధవారం జనరల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మెన్ మాట్లాడుతూ స్విమ్స్ లో మరింత ఉన్నతంగా సేవలు అందించేందుకు గత మూడు నెలల నుండి మాజీ టిటిడి ఈవో శ్రీ ఐవి సుబ్బారావు అధ్యక్షతన వేసిన ప్రత్యేక ఎక్స్ ఫర్ట్ కమిటీ అధ్యయనం చేసి నివేదికను సమర్పించిందన్నారు. ఈ నివేదికలో మౌళిక సదుపాయాలు, మానవ వనరులు, వైద్య పరికరాలు, ఇంజనీరింగ్ పనులు, మరింత ఉన్నతంగా వైద్య సేవలు అందించేందుకు వైద్య నిపుణుల సేవలు, నిధుల సేకరణ తదితర అంశాలపై నివేదిక సమర్పించిందన్నారు. ఎక్స్ ఫర్ట్ కమిటీ నివేదికపై టిటిడి బోర్డులో చర్చించి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు. స్విమ్స్ అభివృద్ధికి సూచనలు, సలహాలు ఇస్తున్న ఎక్స్ ఫర్ట్ కమిటీ ఛైర్మెన్ డా. ఐ.వి. సుబ్బారావు, ఇతర సభ్యులను టిటిడి ఛైర్మెన్ కోరారు.

ఈ సందర్భంగా టిటిడి ఈవో శ్రీ జె. శ్యామల రావు మాట్లాడుతూ, స్విమ్స్ చాలా ప్రతిష్ఠాకమైనదని, 2021లో టిటిడిలోకి స్విమ్స్ ను అప్పగించారని, స్విమ్స్ కి టిటిడి నుండి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని, సంవత్సరానికి రూ. 60 కోట్ల గ్రాంట్ తో పాటు ఎంప్లాయ్ హెల్త్ స్కీం, ప్రాణదాన ట్రస్ట్ , వివిధ రకాల ట్రస్ట్ ల ద్వారా సుమారు రూ. 100 కోట్లుకు పైగా సపోర్ట్ చేస్తున్నామని అన్నారు. స్విమ్స్ అనేది పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు స్థాపించబడిందని, సంవత్సరానికి 18,000 సర్జరీలు, దాదాపు 4. 50 లక్షలుకు పైగా ఔట్ పేసెంట్లు, 47 వేల ఇన్ పేసెంట్లు వైద్య సేవలు పొందుతున్నారని, ఇందులో పేదలే అత్యధికంగా ఉన్నారని తెలిపారు. స్విమ్స్ లో భవిష్యత్ తరాలకు సరిపడేలా ప్లాన్ ప్రకారం నూతన భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయని, అంకాలజీ , చిన్న పిల్లల హెల్త్ కోసం నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు, అంకాలజీని లెవన్ వన్ సెక్టార్ గా తీసుకెళ్లేందుకు , స్విమ్స్ లో ఫ్యాకల్టీ సమస్య, మానవ





వనరులు, మౌళిక సదుపాయాల కల్పన, నిర్మాణాలు, నిధుల సమీకరణ, స్వచ్ఛంగా వచ్చే నిపుణులైన వైద్యుల సేవలు తదితర అంశాలు, సమస్యల పరిష్కారం కేసం ఎక్స్ ఫర్ట్ కమిటీ వేశారని, ఈ కమిటీ ఇచ్చిన నివేదికపై జనరల్ కౌన్సిల్ చర్చించామన్నారు.

అంతకుముందు టిటిడికి అనుబంధంగా ఉన్న స్విమ్స్ లోని అత్యాధునిక వైద్య పరికరాలతో నిర్మితమవుతున్న క్యాన్సర్ భవనాన్ని టిటిడి ఛైర్మెన్ పరిశీలించారు. 391 పడకలు గల నూతన క్యాన్సర్ భవనాన్ని, అందులోని 5 ఆపరేషన్ థియేటర్లను, పరికరాలను పరిశీలించారు. స్విమ్స్ కార్డియో థొరాసిక్ విభాగంలో శస్త్ర విభాగంలో చికిత్స పొందుతున్న కర్నూలు జిల్లా మంత్రాలయంకు చెందిన అన్నాభాయ్ (24 సంవత్సరాలు), ప్రకాశం జిల్లా రామాయపాలెం గ్రామానికి చెందిన బి. బన్సికా (2 సంవత్సరాలు) ఆరోగ్యం, అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నెల్లూరు జిల్లా కలిగిరి, కడప జిల్లా ఓబుళవారిపల్లి, చిత్తూరు జిల్లా పాలసముద్రం, తిరుపతి జిల్లా కాళహస్తి ప్రాంతాల నుంచి వచ్చిన వివిధ రకాల రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ ఫర్ట్ కమిటీ ఛైర్మన్ డా.ఐ.వి.సుబ్బారావు, సభ్యులు డా. జెఎస్ఎన్ మూర్తి, శ్రీ తేజోమూర్తుల రామోజీ, డా. చెన్నంశెట్టి విజయ్ కుమార్, స్విమ్స్ డైరెక్టర్ డా. ఆర్వీ కుమార్, టిటిడి బోర్డు మెంబర్ శ్రీ ఎన్. సదాశివరావు, జేఈవో శ్రీ వి. వీరబ్రహ్మాం, సీఈ శ్రీ సత్యనారాయణ హాజరుకాగా వర్చువల్ గా హెల్త్ స్పెషల్ సిఎస్ శ్రీ ఎం.టి. కృష్ణబాబు, టిటిడి బోర్డు మెంబర్ శ్రీమతి సుచిత్రా ఎల్లా, ఎండోమెంట్ సెక్రటరీ శ్రీ వినయ్ చంద్ తదితరులు హాజరయ్యారు.

# కెసిఆర్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం

**కాంగ్రెస్‌లో విలీనం కానున్న బిఆర్ఎస్**
**జూన్ 2 లేదా 9న ముహూర్తం**
**బిజెపి మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు**

హైదరాబాద్: కెసిఆర్ సిఎంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడబోతోందని తెలంగాణ బిజెపి ఉపాధ్యక్షుడు, మాజీ ఎంఎల్ఎ ఎన్విఎస్ఎస్ ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య డీల్ కుదిరిందని జోస్యం చెప్పారు. బుధవారం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ స్థానంలో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ముఖ్యమంత్రి అవుతారని, కాంగ్రెస్‌లో బిఆర్ఎస్ విలీనం కాబోతోందని, జూన్ 2న లేదా డిసెంబర్ 9 తర్వాత విలీనం ఉంటుందన్నారు. కెటిఆర్ నాయకత్వంలో పని చేస్తానన్న హరీశ్‌రావు వ్యాఖ్యలే అందుకు నిదర్శనమని ఎన్విఎస్ఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు. రేవంత్ ప్రభుత్వంలో పేదలకు సంక్షేమ పథకాలు అందడం లేదని మండిపడ్డారు. ఒక గ్రామంలో కటిక పేద కుటుంబం, వికలాంగుల కుటుంబం, దళిత కుటుంబం కూడా అదేనని కానీ ఇందిరమ్మ ఇల్లు రాలేదన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వంలో ధనికులకే పథకాలు అందుతున్నాయని ధ్వజమెత్తారు. కెసిఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు బిఆర్ఎస్ వాళ్లకు, రేవంత్ ప్రభుత్వంలో కాంగ్రెస్ కు చెందిన వ్యక్తులకు సంక్షేమ పథకాలు అందుతున్నామని ప్రభాకర్ విమర్శలు గుప్పించారు. రెండు ప్రభుత్వాలలో పేదవారికి సంక్షేమ పథకాలు అందడం లేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం ఖాయమంటూ బీజేపీ నేత చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. తెలంగాణ రాజకీయాల్లో ఈ అంశం హాట్‌టాపిక్‌గా మారింది. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకటే అంటూ చాలా సార్లు బీజేపీ

ఆరోపణలు చేసింది. బీజేపీకి కాంగ్రెస్‌కు మధ్య అంతర్గత ఒప్పందం ఉందంటూ బీఆర్ఎస్ పార్టీ కూడా ఆరోపణలు గుప్పించిన విషయం తెలిసిందే. అయితే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు కొంత బలాన్ని చేకూర్చిన-ల్గ÷టెంది. గత కొద్ది

రోజులుగా తెలంగాణలో పాలన స్తంభించింది. అనుకున్న స్థాయిలో వెల్ఫేర్ స్కీమ్స్ ముందుకు తీసుకువెళ్లడం లేదు. తెలంగాణ అప్పుల కుప్పగా మారిపోయిందని, తెలంగాణలో పూర్తి స్థాయి వెల్ఫేర్ స్కీమ్స్‌ను ముందుకు తీసుకుపోయే పరిస్థితి లేదని, ఉద్యోగ సంఘాలు ప్రభుత్వ నిర్ణయాన్ని, ప్రభుత్వాన్ని అర్థం చేసుకుని ముందుకు వెళ్లాల్సిందిగా స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ చేసిన వ్యాఖ్యలను విశ్లేషించుకుని ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున విమర్శలు గుప్పిస్తోంది.

# ఆధిపత్య పోరే హత్యకు కారణం

ఒంగోలు: తెదేపా నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసు మిస్టరీని ఎట్టకేలకు పోలీసులు ఛేదించారు. ఈ హత్య కేసులో 11 మంది నిందితులను గుర్తించామని జిల్లా ఎస్పీ దామోదర్ వెల్లడించారు. బుధవారం విలేకర్ల సమావేశంలో ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ.. 9 మంది నిందితులను అరెస్టు చేశామన్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని చెప్పారు. మృతుడు వీరయ్య స్వగ్రామం అమ్మనబ్రోలుకి చెందిన ఆళ్ళ సాంబయ్య ఈ హత్య కేసులో ప్రధాన కుట్రదారుడిగా తమ దర్యాప్తులో గుర్తించామన్నారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలుకు చెందిన వీరయ్య చౌదరి ఏప్రిల్ 22వ తేదీ సాయంత్రం 7.30 గంటల సమయంలో ఒంగోలులోని ఆయన కార్యాలయంలో దారుణ హత్యకు గురయ్యారు. కత్తులతో ఆయన్ను 53సార్లు విచక్షణారహితంగా పొడిచి హతమార్చారు. ఆపై స్కూటీ, ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. అధికార పార్టీ నేత హత్యతో జిల్లా పోలీసులు దర్యాప్తును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. 9 మంది నిందితులను అరెస్టు చేసి బుధవారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. కేసు వివరాలను జిల్లా ఎస్పీ ఆర్.దామోదర్ వెల్లడించారు. వీరయ్య చౌదరి హత్యకు ప్రధాన సూత్రధారి ఆళ్ల సాంబయ్య అలియాస్ సిద్ధాంతి. అమ్మనబ్రోలు గ్రామంలో అధిపత్యపోరే హత్యకు ప్రధాన కారణం. రాజకీయ కక్షలతో పాటు-ఇసుక వ్యవహారంలోనూ సాంబయ్యతో వీరయ్య చౌదరికి విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో కిరాయి వ్యక్తుల సాయంతో వీరయ్యచౌదరిని హతమార్చారు. బోర్లగుంట వినోద్ కుమార్, తువ్వర వంశీకృష్ణ, బెల్లంకొండ వెంకట గౌతమ్, మన్నెం తేజ, మార్టూరి కిరణ్ కుమార్, షేక్ సమీర్, ఆళ్ల సాంబయ్య, వీరగంధం దేవేంద్రనాథ్ చౌదరి, తోట శ్రీనివాసరావులను అరెస్టు చేశాం.

# పశు సంవర్ధక శాఖలో కీలక మార్పులు

**ఆధార్ తరహాలో పశువులకు గోధార్**

**తిరుపతి పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాలని సూచన**

**విజయవాడ:** పశు సంవర్ధక శాఖలో కీలక మార్పులు చెయ్యడానికి ఏపీ ప్రభుత్వం సిద్ధం అవుతోంది. మనుషులకు ఆధార్ తరహాలో పశువులకు గోధార్‌పై కసరత్తు చెయ్యాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. పశు సంవర్ధక శాఖ కాంక్లేవ్‌లో స్టార్టప్ ప్రతినిధులు వివిధ అంశాలను సీఎంకు వివరించారు. బుధవారం ఉదయం విజయవాడలో స్టార్టప్ కంపెనీలతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించారు. మనుషులకు ఆధార్ లాగా పశువులకు గోదార్‌ను తెస్తున్నట్టు స్టార్టప్ కంపెనీలు సీఎం చంద్రబాబుకు ప్రజెంటేషన్ ఇచ్చాయి. దీనిపై ఆసక్తి చూపిన చంద్రబాబు.. తిరుపతి జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు. తిరుపతి జిల్లాలోని అన్ని పశువులకు గోదార్ అనుసంధానం చేయాలన్నారు. కోళ్లకు వచ్చే వ్యాధులను గుర్తించటం, వాటి ఆరోగ్య విషయాలు తెలుపటంపై ప్రత్యేక యాప్ తీసుకురావాలని సీఎం చంద్రబాబు స్టార్టప్ కంపెనీలకు కోరారు. ప్రపంచంలో యువత ఎక్కువగా ఉండేది భారత్‌లోనే అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఆర్థిక సంస్కరణలతో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం వచ్చిందని చెప్పారు. అప్పుడప్పుడే వస్తున్న ఐటీని సద్వినియోగం చేసుకున్నామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు-భాగస్వామ్యంతో ఏ పనైనా సులువుగా చేసుకునే పరిస్థితి వచ్చింది. గతంలో ఎక్కడ చూసినా రహదారులు గుంతలతో కనిపించేవి. ప్రభుత్వ, ప్రైవేటు-భాగస్వామ్యంతో రోడ్లను చక్కగా నిర్మించారు. ఇప్పుడు ఎక్కడ చూసినా జాతీయ రహదారుల అభివృద్ధి జరుగుతోంది. సంపద సృష్టించాలి.. ప్రజలకు అందించాలి. పేదరికం లేని సమాజమే లక్ష్యంగా పెట్టుకున్నాం. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తున్నాం. నేను ఎప్పుడూ విద్యార్థిగానే ఉంటా.. అనునిత్యం కొత్త విషయాలు తెలుసుకుంటా. సాంకేతికత ప్రతి ఒక్కరికీ అందుబాటు-లో ఉంది. సాంకేతిక యుగంలో సమర్థత పెంచుకోవాలి. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు ఉన్నారు.. అందులో తెలుగువాళ్లే అధికం. నా ఆలోచన ఒకటే. మనం బాగుంటేనే చాలదు.. తిరిగి

# కాల్పుల విరమణతో మోడీ ఇమేజ్ పెరిగిందా..తగ్గిందా!

పాకిస్తాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం ప్రధాని మోడీ రాజకీయ ఇమేజ్‌ను ప్రభావితం చేసిందా అన్న చర్చ దేశ ప్రజల మధ్య తీవ్రంగా సాగుతోంది. ఆపరేషన్ సిందూర్, బాలాకోట్ దాడులతో ఉగ్రవాద వ్యతిరేక యోధుడుగా ఇమేజ్‌ని సొంతం చేసుకున్న మోడీ ఇప్పుడు ఎందుకిలా చేశారు అనే ప్రశ్న అందరి మదిలో మెదులుతోంది. ఆపరేషన్ సిందూర్ తో పాకిస్తాన్ ఎంతగానో బెదిరిపోయింది. అది అనివార్యంగా చర్చలకు వచ్చేలా చేసింది. అయితే, యుద్ధ క్షేత్రంలో దాయది పై పూర్తిగా పై చేయి సాధించిన భారత్.. మరోమారు అది వికృత చేష్టలకు పాల్పడకుండా ఎలాంటి ఒప్పందాలు లేకుండానే కాల్పుల విరమణకు ఎందుకు ఒప్పుకుంది అనేది ప్రశ్న. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌ని భయపెట్టగలిగాము..కానీ అది ఎంత కాలం అనే ప్రశ్న అనివార్యంగా వస్తుంది. ఒకవైపు, కాల్పుల విరమణ.. మరోవైపు పాకిస్తాన్ ఎప్పటిలాగే ఎల్ఓసీ వద్ద తన కుక్కబుద్ధి ప్రదర్శన. అది మళ్లీ భారత్ వైపు కన్నెత్తి చూడకుండా చేసేందుకు అందివచ్చిన అవకాశాన్ని భారత్ ఎందుకు వదులుకుంది? ఏ ఒత్తిడులకు తలొగ్గి కాల్పుల విరమణకు ఒప్పుకుందో ప్రధాని మోడీ ప్రజలకు చెప్పాలంటూ ప్రతిపక్షాలు నిలదీస్తున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందం రాజకీయ రాజీగా విమర్శలు ఎదుర్కొంటోంది. అయితే ఈ నిర్ణయం మోడీ దీర్ఘకాల వ్యూహాత్మక దృష్టిని ప్రతిబింబిస్తుందని అధికార వర్గాలు అంటున్నాయి. కానీ దీనిని అర్థం చేసుకునే స్థితిలో ఇప్పుడు భారత ప్రజలు ఉన్నారా? విమర్శకులు కూడా ఈ నిర్ణయాన్ని మోడీ స్ట్రాంగ్ మ్యాన్ ఇమేజ్‌కు ఎదురుదెబ్బగా చూస్తున్నారు. పాకిస్తాన్ బలహీనత, అంతర్జాతీయ ఒత్తిడి ఈ ఒప్పందానికి దారితీశాయనేది బహిరంగ రహస్యం. ఏదేమైనా, ఆపరేషన్ సిందూర్ తో ప్రధాని మోడీ ఇమేజ్ ఒక్కసారిగా పైకెళ్లి, ఆ తర్వాత ఆయన భక్తులు కూడా ఉస్సూరుమనే పరిస్థితి ఏర్పడిందనేది కళ్లముందు కనిపిస్తున్న నిజం. వారే కాదు, రాజకీయ నాయకులు, విద్యావేత్తలు, మేధావులు, రక్షణ రంగ నిపుణులు, కళాకారులు, జర్నలిస్టులు ఇలా ప్రతీ ఒక్కరూ తీవ్ర నిరాశకు లోనయ్యారు. దీంతో ఆత్మరక్షణలో పడిన ప్రధాని మోడీ డ్యామేజీ కంట్రోల్‌కు దిగినట్టు కనిపిస్తోంది. సోమవారం జాతినుద్దేశించి ప్రసంగించడం, ఆ మరుసటి రోజే పంజాబ్‌లోని ఆదంపూర్ ఎయిర్‌బేస్‌ను సందర్శించడం ఇందులో భాగమేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 'కాల్పుల విరమణ'పై ఆగ్రహంతో ఉన్న వారిని తన ప్రసంగంతో దారికి తెచ్చుకోవాలని ప్రధాని మోడీ ఎంతో ప్రయత్నించారు. భావోద్వేగపూరిత సంభాషణలతో స్పీచ్‌ను కొనసాగించారు. అయితే, ప్రజలు, మేధావులు మోడీ నోటివెంట వినాలనుకొన్నది సెంటిమెంట్ స్పీచ్ కాదు. 'కాల్పుల విరమణ' నిర్ణయాన్ని ఎందుకు, ఏ పరిస్థితుల్లో అంగీకరించాల్సి వచ్చిందన్న దానిపైనే అందరి ఆసక్తి నెలకొంది. అయితే, తన ప్రసంగంలో ఆ విషయాన్నే మోడీ దాటవేశారు. 'ట్రంప్ వాణిజ్య బెదిరింపుల వ్యాఖ్యల'పై కూడా ఆయన స్పందించలేదు. దీంతో మోడీ వైఖరిపై అందరూ మండిపడ్డారు. ప్రసంగం నిస్తేజంగా ఓ ప్రహసనంలా సాగిందని ధ్వజమెత్తారు. జాతినుద్దేశించి మాట్లాడటం పార్లమెంట్ సమావేశాలకు ప్రత్యామ్నాయం కాదని, బాధ్యతల నుంచి ప్రధాని తప్పించుకోలేరని ప్రముఖ జర్నలిస్ట్ రాజు పార్లేకర్ వంటి వారు బహిరంగంగానే విమర్శించారు. 'ట్రంప్ వాణిజ్య వ్యాఖ్యల'పై తన ప్రసంగంలో ఒక్కమాట కూడా ప్రధాని ఎత్తలేదు. అయితే, ప్రసంగం అయ్యాక.. అమెరికాతో చర్చల్లో వాణిజ్యం ప్రస్తావనే రాలేదంటూ కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఓ మొక్కుబడి ప్రకటనను విడుదల చేశాయి. దీంతో నెటిజన్లు మరింతగా మండిపడ్డారు. మొత్తంగా తన ప్రసంగం కూడా ప్రభావం చూపలేదని గ్రహించిన ప్రధాని మోడీ మంగళవారం పంజాబ్‌లోని ఆదంపూర్ ఎయిర్‌బేస్‌ను సందర్శించి జవాన్లతో ముచ్చటించారు. పనిలోపనిగా సైనికుల్లో ధైర్యాన్ని నింపేలా ప్రసంగించారు. భారత ఆడపడుచుల సిందూరం తుడిచిన వారి నట్టింట్లోకి వెళ్లి మరీ నాశనం చేశామంటూ మాట్లాడారు. భారత్‌ను, ప్రజలను రక్షించుకోవడానికి ఎంత పెద్ద నిర్ణయమైనా తీసుకొంటామన్నారు. ఐతే, ఈ పర్యటన కూడా బెడిసికొట్టినట్టే కనిపిస్తోంది. జవాన్లతో మోడీ చేసిన వ్యాఖ్యలపై కూడా నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. 'పహల్గాం మహిళల సిందూరాన్ని దూరం చేసిన ఉగ్రవాదులను, వారిని ఎగదోసిన పాక్‌ను విడిచిపెట్టడమేనా మీరు చెప్తున్న ఆ పెద్ద నిర్ణయం' అంటూ నెటిజన్లు మోడీ వీడియోను ట్యాగ్ చేస్తూ ఎద్దేవా చేస్తున్నారు. యుద్ధానికి ముందు లేదా యుద్ధం జరుగుతున్నప్పుడు నాయకుడు అనే వాడు సైన్యంలో ధైర్యాన్ని నూరిపోయడం చూశాంగానీ, యుద్ధం పూర్తయ్యాక వెళ్లడమేంటని మోడీని ఉద్దేశిస్తూ వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. లైవ్ స్ట్రీమింగ్, యూట్యూబ్, ఎఫ్‌బీ, ఎక్స్ లైవ్ వీడియోల్లో మోడీ ప్రసంగాల కు వ్యూయర్‌షిప్ భారీగా తగ్గింది. మరోవైపు, 'కాల్పుల విరమణ' నిర్ణయంపై నెటిజన్లు మోడీ సర్కారుపై విమర్శలు చేయడం .. ఇంతలో 'మాదే విజయమ'ని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించటం జరిగిపోయాయి. పాక్ సైనికులు మిఠాయిలు పంచుకొంటూ సంబురాలు చేసుకొన్న వీడియోలు వైరల్‌గా మారాయి. దీంతో మోడీ ప్రభుత్వంపై విమర్శల తీవ్రత మరింత పెరిగింది. ఇంటా బయటా ముప్పేట దాడి పెరుగుతుండటం, ఇంతలోనే 'కాల్పుల విరమణ' నిర్ణయాన్ని పక్కనబెట్టి సరిహద్దుల్లో పాక్ మళ్లీ డ్రోన్ల దాడులతో కవ్వింపులకు పాల్పడుతుండటంతో ఎన్డీయే ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి అయ్యింది. డ్యామేజీ కంట్రోల్ చేసుకోకుంటే పరిస్థితి చేజారే ప్రమాదమున్నదని గ్రహించిన ప్రధాని మోడీ జాతినుద్దేశించి ప్రసంగించారు. అయితే, అంతకు ముందే లైన్‌లోని వచ్చిన ట్రంప్.. వాణిజ్యం ఆపేస్తానని బెదిరించడంతోనే భారత్-పాక్ కాల్పుల విరమణకు ఒప్పుకొన్నాయని బాంబు పేల్చారు. దీంతో మోడీ సర్కారు తీవ్ర ఇరకాటంలో పడింది. మొత్తంగా 'కాల్పుల విరమణ' ప్రకటన, దాని తదనంతర పరిణామాలపై ప్రధాని మోడీ ఆత్మరక్షణలో పడి ఇమేజ్ మేకోవర్ కోసం ప్రయత్నిస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆ ప్రయత్నాలు కూడా విఫలమవుతున్నాయని చెప్తున్నారు. రాబోవు రోజులలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో వేచి చూడాలి.

# అమెజాన్ ప్రైమ్‌లోనూ యాడ్స్




ప్రముఖ ఓటిటి స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియో యూజర్లకు షాక్ ఇవ్వబోతోంది. ప్రైమ్ వీడియోలో ఇకపై యాడ్స్ దర్శనం ఇవ్వనున్నాయి. వచ్చే నెల నుంచి సినిమాలు, షోల మధ్యలో ప్రకటనలు కనిపించనున్నాయి. ప్రకటనల్లేని వీడియో స్ట్రీమింగ్ సేవలు పొందాలంటే అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు యూజర్లకు ఇ-మెయిల్స్ పంపిస్తోంది. అమెజాన్ ప్రైమ్ సబ్‌స్క్రిప్షన్ తీసుకున్న వారికి ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ మధ్యలో ప్రస్తుతం ఎలాంటి యాడ్స్ కనిపించడం లేదు. జూన్ 17 నుంచి మాత్రం పరిమితి సంఖ్యలో యాడ్స్ దర్శనం ఇవ్వనున్నాయి. మెరుగైన కంటెంట్‌ను అందించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు- అమెజాన్ యూజర్లకు పంపిన మెయిల్స్‌లో పేర్కొంది. సంప్రదాయ టీవీ ఛానెళ్లు, ఇతర మాధ్యమాల మాదిరిగా కాకుండా 'అర్థవంతమైన' యాడ్స్ మాత్రమే ప్రదర్శిస్తామని తెలిపింది. ప్రస్తుత ప్రైమ్ మెంబర్ షిప్ ధరలో ఎలాంటి మార్పులూ చేయడం లేదని పేర్కొంది. యాడ్ ఫ్రీ ఎక్స్‌పీరియన్స్ కోరుకునే వారి కోసం కొత్తగా రెండు ప్లాన్లను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుత ప్రైమ్ మెంబర్‌షిప్ ఉన్నవారు నెలవారీ రూ.129, ఏడాదికి రూ.699 చొప్పున యాడ్-ఆన్ ప్లాన్స్ తీసుకుంటే ఎలాంటి ప్రకటనలూ కనిపించవని తెలిపింది. జూన్ 17 నుంచి ఈ ప్యాక్స్



## కాలేజీ డేస్‌లోనే మహేశ్ బాబు తెలుసు


కాలేజ్ డేస్ నుండే మహేష్ బాబుతో త్రిష పరిచయయముందంట. సూపర్ స్టార్ మహేష్ బాబు, త్రిష జోడీ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ జోడికి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ కూడా ఉంటుంది. వీరిద్దరు అతడు సినిమాలో నటించగా, అప్పట్లో ఎంత పెద్ద విజయం సాధించిందో అందరికీ తెలిసిన విషయమే. ఇప్పటికి కూడా ఈ సినిమా టీవీలో వేస్తే చాలు ఎంతోమంది చూస్తూ ఉంటారు. ఒక రకంగా టీవీలో బ్లాక్ బస్టర్ సినిమా ఏది అంటే అతడు అనే అంటారు అందరూ. మహేష్ బాబు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వచ్చిన ఈ సినిమా థియేటర్స్ లో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన బుల్లి తెరపై మాత్రం మంచి విజయం సాధించింది. ముఖ్యంగా ఈ చిత్రంలో త్రిష, మహేష్ మధ్య సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. బావ ప్రేమకోసం ఎదురుచూసే పల్లెటూరి అమ్మాయిగా త్రిష పాత్రలో ఒదిగిపోయింది. ఇక మహేష్ బాబు కూడా కాస్త యాటిట్యూడ్ ప్రదర్శిస్తూ సీరియస్‌గా చాలా అద్భుతంగా నటించారు. వారిద్దరి పాత్రలకి ప్రేక్షకులు ఇట్టే కనెక్ట్ అయ్యారు. అతడు తర్వాత త్రిష మహేష్ బాబు కలిసి సైనికుడు సినిమా చేశారు. కానీ ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. ఆ తర్వాత త్రిష, మహేష్ బాబు కలిసి నటించలేదు. ఇదిలా ఉంటే ఓ ఇంటర్వ్యూలో మహేష్ బాబు గురించి త్రిష ఆసక్తికర కామెంట్స్ చేసింది. మహేష్ బాబు తన ఫేవరెట్ హీరోల్లో ఒకరు అని చెప్పిన ఈ ముద్దుగుమ్మ .. మహేష్ బాబు సెట్ లో చాలా సరదాగా ఉంటాడని, చాలా హార్డ్ వర్క్ చేస్తాడు అని పేర్కొంది.. ఎంత పెద్ద స్టార్ హీరో అయినా కూడా అందరిని చాలా గౌరవిస్తాడు. అసలు కారవాన్ లోకి కూడా వెళ్లడు. తన షూటింగ్ అయిపోయినా కూడా .. మానిటర్ దగ్గర కూర్చొని ప్రతి ఒక్కటి గమనిస్తూ ఉంటారు.. చాలా మందికి తెలియని విషయం ఏంటంటే మహేష్ బాబు నాకు చాలా కాలం నుంచి తెలుసు. మేము ఇద్దరం కాలేజ్ డేస్‌లో చెన్నైలో ఉన్నాము. మా ఇద్దరికి మ్యూచువల్ ఫ్రెండ్స్ ఉండేవారు. వారి వల్ల మహేష్ తో పరిచయం ఏర్పడింది. ఆ టైం లో మేము యాక్టర్స్ అవుతామని ఊహించలేదు. అప్పుడు హాయ్, బాయ్ ఫ్రెండ్షిప్ మాత్రమే ఉండేది అని త్రిష పేర్కొంది. ఇక ఈ అమ్మడు చాలా రోజుల తర్వాత తెలుగులో చిరంజీవితో విశ్వంభర చేస్తుంది.



## నిర్మాణం పూర్తి చేసుకుంటున్న కూలీ




ముందు అనుకున్న స్టోరీ వేరన్న లోకేశ్ కనగరాజు రజనీకాంత్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'కూలీ' . నాగార్జున, ఉపేంద్ర, సౌబిన్ షాహిర్, సత్యరాజ్, శ్రుతిహాసన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకొంటోంది. ఈ క్రమంలో దర్శకుడు లోకేశ్ కనగరాజ్ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. రజనీకాంత్‌కు తొలుత వేరే కథ చెప్పానని, అది ఆయనకు నచ్చినా అనుకోని కారణాలతో ఈ కథను పక్కన పెట్టినట్లు- తెలిపారు. రజనీకాంత్ సర్‌తో సినిమా చేయాలనుకున్నప్పుడు ఆయన్ను కలిసి ఒక కథ చెప్పాను. అయితే, అది కార్యరూపం దాల్చలేదు. దాదాపు రెండు నెలలకు పైగా ఆ స్క్రిప్ట్‌పై వర్క్ చేశాం. ఆ కథ, దాని నేపథ్యం రజనీ సర్‌కు బాగా నచ్చాయి. రెండు నెలల తర్వాత మళ్లీ ఆయన్ను కలిసినప్పుడు 'ఈ కథ వద్దు. మరొక స్టోరీ చేద్దాం' అని అన్నాను. అదే 'కూలీ'. రజనీ సర్‌కు ఆ స్టోరీ నచ్చినా నేను చేయకపోవడానికి ఒక కారణం ఉంది. నేను అనుకున్న పాయింట్ ఒక చోట పూర్తిగా డౌన్ అయిపోయినట్లు- అనిపించింది. దీంతో ఆ ప్రాజెక్ట్‌పై ఆసక్తి సన్నగిల్లిపోయింది. భవిష్యత్‌లో ఎప్పుడైనా కొత్త ఆలోచన వస్తే, ఆ కథను అందుకు అనుగుణంగా ముందుకు తీసుకెళ్తా. అంతేకానీ, అదే కథను పట్టుకుని రజనీ సర్ విలువైన సమయాన్ని వృథా చేయటం నాకు ఇష్టం లేదని లోకేశ్ కనగరాజ్ చెప్పుకొచ్చారు. ఇక 'కూలీ' విషయానికొస్తే భారీ బడ్జెట్, భారీ తారాగణంతో లోకేశ్ దీన్ని తీర్చిదిద్దారు. ఐటమ్ సాంగ్‌లో పూజా హెగ్డే ఆడి పాడింది. ఆమిర్‌ఖాన్ కూడా అతిథి పాత్రలో తళుక్కున మెరవనున్నారు. ఆగస్టు 14న తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 'కూలీ'ని విడుదల చేయనున్నారు. ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోనూ ఈ మూవీ తీసుకొస్తున్నారు. రజనీకాంత్ ఇందులో కూలీ నెంబర్ 1421గా దేవా పాత్రలో సందడి చేయనున్నారు. అనిరుధ్ స్వరాలు సమకూరుస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది.



## నన్ను భరిస్తున్నందుకు థ్యాంక్స్

తన భార్యతో ప్రపంచ దేశాలు తిరగడం తనకు ఇష్టమని బ్రహ్మాజీ చెబుతుంటాడు.

భార్యకు వెరైటీగా బ్రహ్మాజీ వెడ్డింగ్ యానివర్సరీ విషెస్

నటుడు బ్రహ్మాజీ టైమింగ్ సెన్స్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆయన ఆన్‌స్క్రీన్‌లోనే కాదు ఆఫ్‌స్క్రీన్‌లోను తెగ నవ్విస్తుంటాడు. ఈ మధ్య సోషల్ మీడియాలోను చాలా యాక్టివ్‌గా ఉంటూ ఆసక్తికర విషయాలు పంచుతున్నాడు. తన పర్సనల్, ప్రొఫెషనల్ లైఫ్‌కి సంబంధించిన ఇంట్రెస్టింగ్ విషయాలు కూడా షేర్ చేస్తున్నాడు. అయితే బ్రహ్మాజీ సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా కూడా తన ఫ్యామిలీకి తప్పక కొంత సమయం కేటాయిస్తుంటాడు. తాను సంపాదించిన డబ్బు అంతా కూడబెట్టడం గానీ, ఇన్వెస్ట్ చేయడం వంటిది చేయను. వాటితో ప్రపంచదేశాలు చుట్టి వస్తానని ఓ ఇంటర్వ్యూలో అన్నాడు. బ్రహ్మాజీది ప్రేమ పెళ్లి. వారిద్దరు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఆ ప్రేమ కథ గురించి కూడా బ్రహ్మాజీ ఇది వరకు ఇంటర్వ్యూల్లో చెప్పుకొచ్చాడు. అయితే తన భార్యతో కలిసి అన్ని దేశాలు తిరిగి రావడమే తనకు ఇష్టమని బ్రహ్మాజీ అంటుంటాడు. బ్రహ్మాజీ వెడ్డింగ్ డే కావడంతో తన భార్యకు వెడ్డింగ్ యానివర్సరీ అంటూ స్పెషల్‌గా విషెస్ అందించాడు. పెరుగన్నంలోకి ఆవకాయ్ లా.. పాలకు డెవిడోఫ్ కాఫీలా.. వోడ్కాకి జింజిర్ ఆలేలా.. నా జీవితానికి నవ్వుల్లా.. నన్ను భరిస్తున్నందుకు థాంక్స్.. హ్యాపీ యానివర్సరీ సస్వతి అంటూ బ్రహ్మాజీ పోస్ట్ పెట్టాడు. ఇది నెట్టింట వైరల్‌గా మారింది. బ్రహ్మాజీ సరదా మనిషే కాదు సీరియస్ కూడా. కొన్ని సార్లు ఆయన చేస ట్వీట్స్ వివాదాలకి కూడా దారి తీస్తుంటాయి. రీసెంట్‌గా పౌన్సర్ల వ్యవస్థ మీద స్పందించిన బ్రహ్మాజీ తనదైన శైలిలో చురకలు అంటించాడు. అయితే గతంలో మాదిరిగా బ్రహ్మాజీ పెద్దగా సినిమాలు చేయడం లేదు. పుష్ప2 లో తనదైన నటనతో అలరించాడు. ఇక బ్రహ్మాజీ తనయుడు సంజయ్ కూడా ఇండస్ట్రీలోకి ఎంట్రీ- ఇవ్వగా, ఆయన చిన్నా చితకా ప్రాజెక్టులతో ఓ గుర్తింపు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తూ ఉన్నాడు.

## జయం రవి,కెనిషాల మధ్య పెరిగిన బంధం



భార్య ఆర్తి కామెంట్స్‌కు కెనీషా ఘాటు జవాబు

హీరో జయం రవి ఇంటి గురించి రోజుకో వార్త వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. ముందు నుంచి సింగర్ కెనీషా ఫ్రాన్సిస్ కి జయం రవి కి మధ్య రిలేషన్ ఉన్నట్లు రూమర్స్ నడుస్తున్నాయి. రీసెంట్‌గా ఓ పెళ్లికి వీరిద్దరు జంటగా హాజరవడంతో మరోసారి కోలీవుడ్ లో పుకార్లు మరింత పుంజుకున్నాయి. ఈ ఫోటో క్షణాల్లోనే సోషల్ మీడియా మొత్తం వైరల్ అవ్వడంతో ఇది చూసిన జయం రవి భార్య ఆర్తి సోషల్ మీడియాలో సంచలన పోస్ట్ చేసింది. 'మాకు చట్టరిత్య ఇంకా విడాకులు అవ్వలేదు, విడాకులు వచ్చేవరకు నేను ఆర్తి రవినే,18 సంవత్సరాలు నాతో కలిసి ఉన్న వ్యక్తి నన్ను ఇంట్లో నుండి గెంటేసి, పిల్లలను కూడా పట్టించుకోకుండా, వారి అవసరాలకు కావలసిన డబ్బు కూడా ఇవ్వడం లేదు' అంటూ షాకింగ్ పోస్ట్ చేసింది. అయితే ఈ మాటలపై తాజాగా సింగర్ కెనీషా రివర్స్ పంచ్ ఇచ్చింది.. ఎవరికీ లొంగని ఒక మగాడు.. ఏ మహిళతో అయితే ఆనందం ఉంటుందో ఆ మహిళ దగ్గరే ఉంటాడు. ఆ మహిళకే మనసు ఇస్తాడు. మౌనంగా ఉంటున్నాను కదా అని నన్ను లైట్ తీసుకోకు.. నా మౌనమే నా బలం' అంటూ ఆర్తికి పరోక్షంగా కొటేషన్‌తో కౌంటర్ ఇచ్చింది. దీంతో సింగర్ కెనీషా పెట్టిన పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. అంటే దీని అర్ధం ఆర్తి దగ్గర ప్రశాంతత లేకపోవడం వల్లే కెనిషాకి జయం రవి దగ్గరై ఆమెకు మనసిచ్చాడని పూర్తిగా అర్థమవుతుంది .

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,